జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

**WANTED**
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | గురువారం 19 మార్చి 2026 | సంపుటి : 1 | సంచిక : 76 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## మళ్లీ తొక్కుకుంటూ వస్తాం

2023 ఎన్నికల్లోనూ బరాబర్ తొక్కుకుంటూ ఇక్కడకు వచ్చాను

- 2029 ఎన్నికలూ పాసింగ్ క్లౌడ్స్ మాత్రమే... 2034 వరకు ఈ ప్రభుత్వమే ఉంటుంది
- ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి తమ సేవకులను నియమించుకుంటారు... ఇప్పటికైనా అది గ్రహించాలి
- గత ప్రభుత్వ రూ. 8.11 లక్షల కోట్ల అప్పు, 11 శాతం అధిక వడ్డీ భారం వల్లనే మా ప్రభుత్వానికీ పరిస్థితి
- వారసత్వాలతో అధికారం రాదు... చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకుంటామంటే కుదరదు.
- ప్రజలు ఆగ్రహిస్తే ఈసారి అది కూడా (ప్రతిపక్ష హోదా) ఉండదు..



హైదరాబాద్

2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మిమ్మల్ని మళ్లీ తొక్కుకుంటూ అధికారంలోకి వస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. '2023 ఎన్నికల్లో బరాబర్ మీ నెత్తిపై కాళ్లు పెట్టి తొక్కుకుంటూ ఇక్కడకు వచ్చాను. 2029లో మళ్లీ చూసుకుందాం. మళ్లీ తొక్కకపోతే చూడండి. మీరు ఎట్లా గెలుస్తారో చూస్తాను'అని ఆవేశంగా ప్రకటించారు. బుధవా రం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానమిస్తూ రెండున్నర గంటలకుపైగా సుదీర్ఘంగా సీఎం ప్రసంగించారు. 'ఇప్పటికైనా మీరు మర్యాదగా ఉండడం నేర్చుకుంటే మంచిది. కనీస మర్యాద - మిగతా 2లో



## ఫామ్‌హౌస్ కేసు.. కొకైన్ కొన్నది హైదరాబాద్‌లోనే?

- శిమ్లా నుంచి తెచ్చినట్లు చెప్పడం కట్టుకథే
- రెండోరోజు నలుగురిని విచారించిన సిట్
- డ్రగ్స్ ముఠాలతో మాజీ ఎమ్మెల్యేకి సంబంధాలపై పోలీసుల ఆరా

హైదరాబాద్

రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో వినియోగించిన కొకైన్‌ను హైదరాబాద్‌లోనే కొనుగోలు చేసినట్టు వెల్లడైంది. శిమ్లా నుంచి తెచ్చినట్లు నిందితుల్లో ఒకరైన బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్ రవి చెప్పినదంతా కట్టుకథేనని - మిగతా 2లో

## పార్లమెంట్ అంటే ఓపెన్ యూనివర్సిటీ



- రాజకీయాల్లో నాయకులకు పదవీ విరమణ ఉండదు: మోదీ
- రాజ్యసభలో 59 మంది ఎంపీలకు వీడ్కోలు
- పార్లమెంట్ సభ్యత్వం ముగిసినప్పటికీ సభ్యులు ప్రజా జీవితంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూనే ఉండాలి
- సహజంగా, అప్రయత్నంగా రాజకీయ విభేదాలకు అతీతంగా వ్యవహరిస్తాం

5



## భారత్‌కు చేరిన జగ్ లడ్కీ

80,886 మెట్రిక్ టన్నుల చమురుతో ముంద్రా పోర్ట్‌కు చేరుకున్న ట్యాంకర్

## ఇరాన్ అణు కేంద్రంపై దాడి

- అతి పెద్ద గ్యాస్ క్షేత్రంపైనా బాంబులు.. ఆ దేశ నిఘా మంత్రినీ చంపేసిన ఇజ్రాయెల్
- హర్మూజ్ తీరంలో బంకర్ బస్టర్ బాంబులతో దాడి.. అణు కేంద్రం పక్కనే రష్యా అణు విద్యుత్ ప్లాంటు
- దాడిని తీవ్రంగా ఖండించిన రష్యా
- ఇజ్రాయెల్, గల్ఫ్‌పై అత్యాధునిక క్షిపణులను ప్రయోగించిన ఇరాన్
- టెల్ అవీవ్‌లో ఇద్దరి మృతి.. లారిజానీ మృతికి కారకులైన వారికి శిక్ష తప్పదన్న ఖమేనీ

5





# మళ్లీ తొక్కుకుంటూ వస్తాం

-మొదటిపేజీ తరువాయి

దక్కుతుంది'అని హెచ్చరించారు. 2029 ఎన్నికలు కూడా కేవలం పాసింగ్ క్లౌడ్ మాత్రమే. 2034 వరకు ఈ ప్రభుత్వమే ఉంటుంది. అప్పటికే తెలంగాణ ఒక ట్రిలియన్ ఎకానమీగా ఎదుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు'అని చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్న హిల్ట్--పి, టీడీఆర్‌లకు సంబంధించి వారు లేఖ రాస్తే ఏ విచారణ కోరినా చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 'కొందరు తమను తాము రాజులుగా భావిస్తున్నారు. రాచరిక పోకడలతో ప్రజాతీర్పును అవమానిస్తున్నారు. వారసత్వ రాజకీయాలను నమ్ముకుని అధికారం దక్కలేదనే దుఃఖంతో ఆరోపణలు, దృ?రష్పచారంతో సభను తప్పుదోవ పట్టించారు. రాజులు పోయినా రాజ్యాలు పోయినా వారి పోకడలు మారలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి తమ సేవకులను నియమించుకుంటారన్న విషయాన్ని ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది'అని బీఆర్‌ఎస్ సభ్యులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**గత ప్రభుత్వం వల్లనే ఈ దుస్థితి**

రాష్ట్ర ఆదాయంపెంచాలి.. పేదలకు పంచాలి అనే పాలసీ తీసుకొస్తే కూడా అభినందించాలనే ఆలోచన ప్రతిపక్షాలకు రాకపోతే వారిని ఏమనాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'తెలంగాణ అభివృద్ధి, ప్రజల భవిష్యత్ పట్ల సభావేదిక నుంచి వివరించాను. అధికారం పోయిందనే బాధతో ఇది కొందరికి రుచించదు. వారు కక్కిన విషాన్ని శివుడి మాదిరిగా గొంతులోనే పెట్టుకుంటాను'అని అన్నారు. తమపై గత ప్రభుత్వం పదేళ్లలో రూ.8.11 లక్షల కోట్ల అప్పు భారాన్ని, దానికి 11 శాతం అధిక వడ్డీ మోపినందుకు, దానిని భరించడం వల్లనే తమ ప్రభుత్వానికి ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను ఆవిష్కరిస్తూ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం చరిత్రాత్మకమని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'గవర్నర్ ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదు. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడానికి అవసరమైన విశిష్ట ప్రణాళిక'అని రేవంత్ పేర్కొన్నారు.

**విపరీత పోకడలకు పోవద్దు**

'కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు విపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తారనిప్రజలు ఆశించారు. సభాసంప్రదాయాలను గౌరవించకపోవడం తెలంగాణకు, ప్రజలకు తీరని మచ్చ'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'వారసత్వాలతో అధికారం రాదు.. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకుంటామంటే కుదరదు. సొంతంగా సత్తా ఉండాలి. ఔరంగజేబుగా మారతామంటే అది దురాశగా మారుతుంది. విపరీత పోకడలు, విధానాలకు పోవద్దు, అధికారం రాలేదని బాధ, దుఃఖం ఉండొద్దు'అని ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'కొందరు తమను తాము దైవాంశ సంభూతులమని అనుకుంటున్నారు. మీరు (బీఆర్‌ఎస్ నేతలు) దేవుళ్లు కాదు, దోపిడీదారులు.
నోటిఫికేషన్లు, ఆర్డర్లు ఎందుకు ఇవ్వలేకపోయారు. అసంపూర్తిగా వదిలి వేసిన అసమర్థులు మీరు. మీలాగా గాలికి వచ్చిన వాళ్లం కాదు. 'నేను కష్టజీవిని. తెలియకపోతే నేర్చుకుంటాను. ఇతరులకు నేర్పుతాను. ఇదే పంథాలో ముందుకు సాగి అనుకున్నవి కచ్చితంగా సాధిస్తాను'అని ఆయన పేర్కొన్నారు. 'పారిశ్రామిక భూముల బదలాయింపులపై 2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు హిల్ట్ పాలసీతో సహా దేనిపై అయినా సీబీఐ, ఈడీ, సిట్, లేదా ఏ అంతర్జాతీయ సంస్థతో విచారణకైనా మేం సిద్ధం. అని బీఆర్‌ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

**కేసీఆర్‌ను ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు..**

'కేసీఆర్ అసెంబ్లీలో ఇదే స్థానం నుంచి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి శాసనసభ కృతజ్ఞతలు చెబుతున్నది, ఆమె దయతోనే తెలంగాణ వచ్చిందన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారు'అని సీఎం రేవంత్ అన్నారు. తండ్రి బతికి ఉండగానే తద్దినం పెట్టడం అంటే ఏమిటో ఇప్పుడు అర్థమవుతోందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బావమరుదులు కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. వారిద్దరు అలాగే వ్యవహరిస్తే.. పార్టీ ముక్కలు అవుతుందని, అది కాకుండా చూసుకోవాలని, అధికారంలోకి వచ్చేది కల్ల అని వ్యాఖ్యానించారు.

**మేము చేసిన అప్పులు రూ. 3.47,294 కోట్లు**

తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన మొత్తం అప్పులు రూ. 3,47,294 కోట్లు అయితే.. తాము చెల్లించిన అసలు, వడ్డీ కలుపుకొని రూ. 3,30,570 కోట్లు అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తాము అధికారంలో ఉన్న ఈ రెండున్నరేళ్లలో నికరంగా చేసిన అప్పు కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమేనని స్పష్టంచేశారు. 2014 జూన్ 2న అధికారం చేపట్టిన టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్)కు అప్పటి వరకున్న అప్పులు కేవలం రూ.69 వేల కోట్లు అయితే.. వారు తమకు 2023 డిసెంబర్‌లో అధికారం అప్పగించే నాటికి అప్పులు రూ. 6,71,757 కోట్లకు తోడు చేతి బదులుగా, కాంట్రాక్టర్లకు బకాయిలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సినవి కలుపుకొంటే మరో రూ. 1.40 లక్షల కోట్లు ఉన్నాయని మొత్తంగా తమకు వారు అందించిన అప్పులు రూ. 8.11 లక్షల కోట్లు అని రేవంత్ వెల్లడించారు. కమీషన్లకు కక్కుర్తిపడి వారు 11 శాతం వడ్డీకి కూడా రుణాలు తీసుకున్నారని దుయ్యబట్టారు. దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలను రీస్ట్రక్చర్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని, అలా చేయడం వల్ల వడ్డీ భారం ఏటా దాదాపు రూ. 4000 కోట్లు ఆదా అవుతాయన్నారు.

**వైద్యానికి రూ. 4400 కోట్లు వ్యయం చేశాం**

పేదల వైద్యం కోసం తమ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 4,400 కోట్లు వ్యయం చేసిందని సీఎం రేవంత్ చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 2,300 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 2046 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని మంత్రుల వద్ద పనిచేసిన పీఏలు ఈ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పేద వారిపేట తీసుకుని వాటిని స్వాహా చేశారని, అలాంటి వారు తమను ప్రశ్నిస్తారా అని దుయ్యబట్టారు. ఆరోగ్యశ్రీని బీఆర్‌ఎస్ పూర్తిగా నాశనం చేసిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన రెండురోజుల్లోనే రూ. 5 లక్షలున్న ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచామని స్పష్టం చేశారు.

**నా కాలి గోటికి సరిపోవు...**

'వార్డు మెంబర్ కూడా కాని వ్యక్తి (హరీశ్‌రావు)ని మంత్రిగా చేసింది దివంగత నేత, నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. కనీసం కృతజ్ఞతా భావం ఉండాలి కదా? చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో సిరిసిల్ల ఎమ్మెల్యేగా (కేటీఆర్) గెలిచారు. నేను స్వశక్తితో జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై ఆ తర్వాతే రాజకీయ పార?టీలోకి వచ్చాను. నాతో నీకు పోలిక ఏమిటి? నాతో పోటీ ఏమిటి? నా కాలిగోటికి కూడా సరిపోవు' అని సీఎం రేవంత్ అన్నారు. '2009లో పొత్తుధర్మంలో భాగంగా పాలమూరు బిడ్డలం కేసీఆర్‌ను భుజాన వేసుకుని ఎంపీగా గెలిపించాం. అన్నం పెట్టిన మాకు సున్నం పెట్టారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ఏదైనా పూర్తిచేశారా?' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

**విధులకు హాజరుకాకుండా జీతాలా?**

'2023 డిసెంబర్ 1 నుంచి ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్ష నేత రూ.1,06,56,674 జీతభత్యాలు పొందారు. విధులకు హాజరుకాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలి. అది ఉద్యోగులైనా రాజకీయ నేతలైనా కూడా చర్యలు తీసుకోవాలి' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు విజ్ఞప్తి... సభకు రండి, చర్చలో పాల్గొనండి.. మాజీ సీఎంకు ఆహ్వానం పలుకుతున్నాం. గవర్నర్ ప్రసంగంపై ప్రభుత్వానికి సూచనలు, సలహాలు వస్తా యని ఆశించాను. ఆశించిన మేర ప్రధాన ప్రతిపక్షం వ్యవహారశైలి లేదు' అని అన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నామన్నారు.

**ఏఐ సునామీ రాబోతుంది...**

భవిష్యత్‌లో ఏఐ సునామీ రాబోతుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'దీనిని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను గవర్నర్ ప్రసంగంలో వివరించారు. రాబోయే రోజుల్లో వైట్‌కాలర్ జాబ్‌లు పోయి బ్లూకాలర్ జాబ్‌లు రానున్నాయి. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్‌ను కనీసం చూశారా? గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించకపోతే తరువాతి తరాలు మనల్ని క్షమించవు. అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించుకున్నాం. తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించుకున్నాం' అని సీఎం వివరించారు.
మూసీ కాలుష్యం కంటే వీరి కడుపుల్లో విషం ఎక్కువ...
గత ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలపై సభలో సీఎంగా కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ మాట్లాడిన మాటలను ట్యాబ్ ద్వారా సభలో సభ్యులకు సీఎం వినిపించారు. 'వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆక్రమణలను నిర్దాక్షిణ్యంగా కొట్టిపారేయాలని మాట్లాడారు. అప్పుడు సక్రమమని చెప్పిన వాళ్లకు ఇప్పుడు అక్రమం ఎలా అయింది? మీరు మాట్లాడిన మాటలను ప్రజలు అప్పుడే మర్చిపోయారనుకున్నారా? మూసీ ఉప్పల్ భగాయత్‌లో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చూద్దాం రండి. ఎవరెవరు ఎక్కడ ఆక్రమించుకున్నారో ఒక నిజ నిర్ధారణ కమిటీ వేద్దాం. మూసీ కాలుష్యం కంటే వీరి కడుపుల్లో విషం ఎక్కువగా ఉంది. బుల్డోజర్లతో కొట్టేయమని చెప్పింది అప్పుడే మరిచిపోయారా' అని పేర్కొన్నారు.

**ఈవీ వాహనాలకు పన్ను మినహాయింపు**

కాలుష్య నియంత్రణలో భాగంగా ఈవీ వాహనాలు కొనుగోలు చేసేవారికి పన్ను మినహాయించామని సీఎం తెలిపారు. త్వరలో క్యూర్ పరిధిలోని ఆటోలను ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నట్టు ప్రకటించారు. 'క్యూర్ ప్రాంతంలో ప్రక్షాళన చేస్తాం. 3 వేలకు పైగా డీజిల్‌తో నడుపుతున్న ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులతో ప్రత్యామ్నాయం చేశాం. డీజిల్, కిరోసిన్‌తో నడిచే ఆటోలను రెట్రోఫిటింగ్‌తో ప్రత్యామ్నాయం చేస్తాం. కాలుష్య నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. హైదరాబాద్‌ను పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి మెట్రో విస్తరించాలని నిర్ణయించాం. అందులో భాగంగా రూ.25 వేల కోట్ల విలువైన మెట్రోను రూ.15 వేల కోట్లకు కొంటున్నాం. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటుంటే.. మేం మాత్రం ప్రైవేట్ సంస్థను కొనుగోలు చేస్తున్నాం. 76 కి.మీ. మెట్రోకు మేం కేంద్రానికి ప్రతిపాదనలను పంపాం' అని చెప్పారు. చైనా నుంచి నేర్చుకుని ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. 'కొంగరకలాన్ రోడ్డుకు టాటా దిగ్గజం రతన్ టాటా పేరు పెడితే అడ్డం పడుకుంటున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీతో మార్పు తీసుకురావాలని చూస్తే పాలకుండలో విషం చుక్కలాగా ప్రవర్తిస్తున్నారు. పెట్టుబడులు వస్తే ఉద్యోగాలు వస్తాయి' అని సీఎం రేవంత్ చెప్పారు.

# మూసీ మంటలు.. కేటీఆర్ వర్సెస్ శ్రీధర్‌బాబు

హైదరాబాద్

మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు అంశం బుధవారం శాసనసభను కుదిపేసింది. బీఆర్‌ఎస్ సభ్యుడు కేటీఆర్, మంత్రి శ్రీధర్‌బాబు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్‌ఎస్ సభ్యులు కేటీఆర్, స్యుదీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డిలు మూసీ పునరుజ్జీవం అంశంపై ప్రశ్నించారు. దాని డీపీఆర్ సిద్ధమైందా, ప్రాజెక్టు వ్యయం అంచనా ఎంత, నిర్వాసితుల సంఖ్య, వారి పునరావాస చర్యల గురించి ప్రశ్నించారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు, ప్రాజెక్టు మొదటి దశకు డీపీఆర్ సిద్ధమైందని, మొదటి దశ అంచనా వ్యయం రూ.ఆరున్నర వేల కోట్ల నుంచి రూ.ఏడు వేల కోట్లని, దాదాపు 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందని, నిర్వాసిత కుటుంబాలకు టీడీఆర్‌ను జారీ చేస్తామని, 2013 చట్టం ప్రకారం సహాయ పునరావాసాలు ఉంటాయని పేర్కొన్నారు. దీనిపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రి, మూసీనది అభివృద్ధి సంస్థ ఎండీ భిన్న ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. డీపీఆర్ తయారీకి 18 నెలల సమయం అవసరమవుతుందని రెండు నెలల క్రితం ఇదే సభలో ప్రకటించిన శ్రీధర్‌బాబు, ఇప్పుడు డీపీఆర్ సిద్ధమైందని చెప్పటం వింతగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి సూత్రప్రాయంగా అంగీకరించిందని సభలోనే శ్రీధర్‌బాబు చెప్పారని, కానీ, ఆ బ్యాంకును జనవరి, మార్చి నెలల్లో రెండు పర్యాయాలు సంప్రదిస్తే... తమకు డీపీఆరే అందలేదని, ఎలాంటి లోన్ మంజూరు చేయలేదని వెల్లడించినట్టు పేర్కొన్నారు.



సమాచార లోపం వల్ల ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారా, లేదా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చెబుతున్నారా అంటూ నిలదీశారు. ప్రాజెక్టుకు ముఖ్యమంత్రేమో రూ.లక్షన్నర కోట్లని చెబుతుంటే, ఇప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు ఆరేడువేల కోట్లని అంటున్నారని నిలదీశారు. మంత్రి శ్రీధర్‌బాబు 1,400 ఇళ్లు కూలుస్తామని అంటున్నారని, మరి గెజిట్‌లో 10 వేలకుపైగా నిర్మాణాలు ప్రభావితానికి గురవుతాయని ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. బఫర్ జోన్ విషయంలో 50 మీటర్లని మంత్రి అంటే, అధికారుల మాటల్లో అది చాలా ఎక్కువగా కనిపిస్తోందన్నారు.

**బురద చల్లటం ఆపాలి: మంత్రి శ్రీధర్‌బాబు**

కేటీఆర్ మాటలపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నేతల వైఖరి ముందు నుంచీ మేం బురద చల్లుతాం...మీరు తుడుచుకోండి అన్నట్టుగా ఉంటోందని అసహనం వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు మొదటి దశ డీపీఆర్‌లో రూ.6,500 నుంచి రూ.7,000 కోట్లు వ్యయం అవుతుందని తాము స్పష్టంగా చెప్పామన్నారు. కేటీఆర్ మాత్రం రూ.లక్షన్నర కోట్ల కుంభకోణం అని అవాస్తవాలతో మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. తాము చేస్తున్న ప్రతి ప్రయత్నానికి అడ్డుగోడ కట్టాలని ఆ పార్టీ సంకుచిత ఆరోపణలు చేస్తోందని తిప్పికొట్టారు. మూసీకి రెండు వైపులా 50 మీటర్ల బఫర్ జోన్‌గా గుర్తిస్తూ 2016 లో అప్పటి ప్రభుత్వం జీఓ ఇచ్చింది నిజం కాదా అని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ఇప్పుడేమో ఇళ్లెలా తొలగిస్తారని ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు కోసం డీపీఆర్ రూపొందించిన మెయిన్ హార్ట్ అనే సింగపూర్ ఇంజనీరింగ్ సంస్థకు ఇటువంటి పనుల్లో అనుభవం ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. కేవలం రెండు నెలల్లో డీపీఆర్ ఎలా తయారైందని కేటీఆర్ ప్రశ్నించటం విడ్డూరమని, డీపీఆర్ తయారీ ఏడాది సమయం పట్టిందన్నారు. రుణం కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకుకు డీపీఆర్ ఇచ్చామని, తన తదుపరి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఏదైనా కారణం చేత ఆ బ్యాంకుకు సాధ్యం కాని పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తామన్నారు.

**బీఆర్‌ఎస్‌కు మూసీ ప్రక్షాళన ఇష్టం లేదా: భట్టి**

బీఆర్‌ఎస్ సభ్యుల తీరుపై ఉప ముఖ్యమంత్రి భట్టి తీవ్రంగా స్పందించారు. మూసీ ప్రక్షాళన ఆ పార?టీకి ఇష్టం లేదోమోనని, దాని పరీవాహక ప్రాంత పేదల జీవితాలు బాగవ్వాలని ఆ పార్టీ కోరుకోవటం లేదేమోనని ఆరోపించారు. మూసి నిర్వాసిత పిల్లల కోసం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆ ప్రాంతంలోనే నిర్మిస్తామన్నారు. ఈ విషయంలో తమ ప్రశ్నలకు మంత్రి నుంచి సరైన సమాధానాలు రాలేదని, ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నామని కేటీఆర్ ప్రకటించడంతో ఆ పార్టీ సభ్యులు సభ నుంచి నిష్క్రమించారు.

## ఫామ్‌హౌస్ కేసు..

## కొకైన్ కొన్నది హైదరాబాద్‌లోనే?

-మొదటిపేజీ తరువాయి

బయటపడింది. రోహిత్‌రెడ్డి సూచన మేరకు తాను ఔటర్ రింగురోడ్డు దగ్గరికి వెళ్లి అభిషేక్‌సింగ్ అనే వ్యక్తి దగ్గర కొకైన్ తీసుకొచ్చినట్లు రోహిత్‌రెడ్డి డ్రైవర్, వ్యక్తిగత సహాయకుడు సిలివేరి శరత్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. శరత్ కూడా ఈ కేసులో నిందితుడు. దీంతో రోహిత్‌రెడ్డికి డ్రగ్స్ ముఠాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. కొత్తగా తెరమీదకొచ్చిన డ్రగ్ పెడ్లర్ అభిషేక్‌సింగ్ హైదరాబాద్‌కు చెందినవాడేనని పోలీసులు గుర్తించారు. అతడు అందుబాటులో లేకపోవడంతో.. సన్నిహితంగా ఉండే వ్యక్తి ద్వారా వివరాలు రాబడుతున్నారు. ఇతడు చిక్కితే కేసు మరో మలుపు తిరగనుంది. అభిషేక్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని ప్రచారం జరుగుతున్నా పోలీసులు ధ్రువీకరించలేదు.

**నలుగురి విచారణ**

సిట్ సభ్యుడు, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ పర్యవేక్షణలో మంగళవారం ఏడుగుర్ని విచారించిన పోలీసులు రెండో రోజైన బుధవారం నలుగుర్ని సుదీర్ఘంగా విచారించింది. బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్ రవి, పుప్పాలగూడకు చెందిన వ్యాపారి తిరువీధుల అర్జున్‌రెడ్డి, వరమాచినేని శ్రవణ్‌కుమార్, సిలివేరి శరత్‌ను బుధవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. వీరిని మంగళవారమూ విచారణకు పిలిచారు. ఈ నలుగురూ కేసులో కీలకం కావడంతో బుధవారం మరోసారి విచారించారు. శిమ్లాలో డ్రగ్స్ కొన్నట్లు చెప్పిన కౌశిక్ రవిని లోతుగా విచారించి మరిన్ని సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. రోహిత్‌రెడ్డి ప్రమేయాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతోనే కౌశిక్ రవి.. డ్రగ్స్ కొనుగోలుపై తప్పుడు సమాచారం ఇచ్చి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. విచారణ సందర్భంగా వీరి ప్రవర్తన ఇబ్బందికరంగా ఉన్నట్లు ఓ అధికారి చెప్పారు. శనివారం పోలీసులు సోదాలకు వెళ్లడం కాస్త ఆలస్యమైనా రోహిత్‌రెడ్డి సహా మిగిలిన 10 మంది పబ్‌కు వెళ్లేవారని తాజా విచారణలో బయటపడింది. నిందితుల్లో కొందరిని గురువారం మరోసారి విచారించనున్నారు.
తెదేపా ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ మినహా 10 మంది నిందితుల ఫోన్లు, కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా వారి ఫోన్లలోని డేటాను విశ్లేషించనున్నారు. డ్రగ్స్ పెడ్లర్లతో సంబంధాలను పరిశీలిస్తామని అధికారులు చెప్పారు.

**కస్టడీ పిటిషన్‌పై వాదనలు**

ఈ కేసులో ముగ్గురు నిందితుల కస్టడీ పిటిషన్‌ను మొయినాబాద్ పోలీసులు ఉప్పర్‌పల్లిలోని న్యాయస్థానంలో దాఖలు చేయగా.. బుధవారం న్యాయమూర్తి విచారించారు. పోలీసులపై కాల్పులు ఎందుకు జరిపారో, డ్రగ్స్ ఎక్కడి నుంచి తెచ్చారో తెలుసుకోవడానికి విచారించాల్సి ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదన వినిపించారు. రోహిత్‌రెడ్డిని కుట్రపూరితంగా అరెస్టు చేశారని ఆయన న్యాయవాది చెప్పారు. నిందితులంతా భయపడి కాల్పులు జరిపారని, వ్యాపార లావాదేవీలపై విచారించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును శుక్రవారానికి వాయిదా వేశారు.

## లూటీకి సహకరిస్తున్న అధికారుల తోకలు కత్తిరిస్తాం

హైదరాబాద్



మూసీ ప్రాజెక్టు విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని, ఆరు నూరైనా పూర్తి చేస్తామంటూ తమ పరిధికి మించి వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టు పేరిట సీఎం చేస్తున్న దోపిడీకి సహకరిస్తున్న అధికారులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, తాము అధికారంలోకి ముచ్చాుక తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. శాసనసభ లాబీలోని బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం చాంబర్‌లో కేటీఆర్ బుధవారం మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. మూసీ సుందరీకరణకు సంబంధించి అందరి అభిప్రాయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తయారు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తోందన్నారు. మూసీ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు రుణం వచ్చిందని, డీపీఆర్ పూర్తయిందని సీఎం, మంత్రులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. డీపీఆర్ పూర్తయినట్లు సభలో ఆధారాలు చూపకపోతే అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెడతామని కేటీఆర్ చెప్పారు. 3,297 ఎకరాల భూ సేకరణ, 10 వేల నిర్మాణాలపై ప్రభావం చూపుతుందని నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. అసెంబ్లీలో మాత్రం 1,400 నిర్మాణాలు ఉన్నాయని మాత్రమే చెప్తోందన్నారు.

**బ్లాక్ లిస్ట్‌లో మూసీ కాంట్రాక్టు సంస్థ**

'మూసీ పరిసరాలను సుందరీకరణ చేయడం మినహా ప్రభుత్వం చేసేదేమీ ఉండదు. మధు రిడ్జ్ పార్కువాసులపై వల్లమాలిన ప్రేమ ఉన్నట్లు నటిస్తున్న సీఎం ఇతర నిర్వాసితులనూ అదే రీతిలో ఎందుకు చూడటం లేదు. మూసీ ప్రాజెక్టు అప్పగించిన మెయిన్‌హార్ట్ కాంట్రాక్టు సంస్థను సింగపూర్, పాకిస్తాన్‌తోపాటు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కూడా బ్లాక్ లిస్టులో పెట్టింది. బఫర్‌జోన్‌లో 50 మీటర్లు దాటి ఎక్కడో 5 కి.మీ. దూరంలో ఉన్న హనుమాన్‌నగర్ వాసులకూ నోటీసులు ఇస్తున్నారు. పలువురు మంత్రులు, సీఎం సోదరుడు, పలువురు నేతల ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. నార్సింగి, మంచిరేవుల వరకు మూసీ బఫర్‌లో అనేక నిర్మాణాలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అంటే సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి అనే విమర్శ ఉంది. హైదరాబాద్‌లో ఏవీ రెడ్డి, కొండల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు ముఠాగా ఏర్పడి రిటైర్డ్ అధికారుల అండతో భూ దందా సాగిస్తున్నారు'అని కేటీఆర్ పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రికి పాలనపై పట్టులేదు..**

'సీఎంకు, మంత్రులకు పాలనపై పట్టులేదు. మొక్కుబడిగా అసెంబ్లీ సమావేశాలు సాగుతున్నాయి. మంత్రులకు
అధికారులు బిజినెస్ రూల్స్ చెప్పాలి. ఐటీ రంగం కుప్పకూలితే హైదరాబాద్‌లో ఆతిథ్య, రియల్ ఎస్టేట్ రంగాలు దెబ్బతింటాయి. ఫ్యూచర్ సిటీ పేరిట ఫార్మాసిటీ కోసం బీఆర్‌ఎస్ హయాంలో సేకరించిన 14 వేల ఎకరాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకుంటున్నారు. ఫార్మా భూముల్లో ఎమ్మెల్యేలు, జర్నలిస్టులు, జడ్జీలు, జూ పార్కులకు భూములు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్తోంది'అని కేటీఆర్ చెప్పారు.

**అసెంబ్లీకి ఎప్పుడు రావాలో కేసీఆర్‌కు తెలుసు**

'అసెంబ్లీకి ఎప్పుడు రావాలో కేసీఆర్‌కు తెలుసు. మా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ధాటిని తట్టుకోలేక అసెంబ్లీ ఎందుకు పెట్టామా అని మంత్రులు తలలు పట్టుకుంటున్నారు. రేవంత్ మమ్మల్ని దూషిస్తున్నా స్పీకర్ ఖండించే పరిస్థితి లేదు. అలాంటపుడు కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు వస్తారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిపై ఇప్పటికే తాత్కాలిక సస్పెన్షన్ విధించాం. ఆయన నుంచి సమాధానం వచ్చిన తర్వాత తుది నిర్ణయం ఉంటుంది. కాంగ్రెస్ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరికపై ఇప్పటివరకు ఎలాంటి సంప్రదింపులు జరపలేదు'అని కేటీఆర్ వెల్లడించారు.

# ఇరాన్ అణు కేంద్రంపై దాడి

దుబాయ్

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం మరింత తీవ్రమైంది. ఏకంగా ఇరాన్‌లోని అణు కేంద్రంపైనే ఇజ్రాయెల్ దాడులు చేసింది. అయితే ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఈ ప్రాంతంలో అణు ధార్మికతపై ఇరాన్, రష్యా ఆందోళన వ్యక్తం చేశాయి. మరోవైపు ఇరాన్ నిఘా మంత్రినీ ఇజ్రాయెల్ చంపేసింది. దీంతో రెండు రోజుల్లోనే ముగ్గురు కీలక నేతలను ఇరాన్ కోల్పోయినట్లయింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. ఈ దాడిని ఖతార్ ఖండించింది. గ్యాస్ క్షేత్రంపై ప్రతిగా గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. అలీ లారిజానీ, గులాం రెజా మరణాలకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్‌లోని 100కుపైగా లక్ష్యాలపై క్షిపణులను ప్రయోగించింది. తన అత్యాధునిక క్షిపణులను వినియోగించింది. టెల్ అవీవ్‌లో ఇద్దరు మరణించారు. హర్మూజ్ జల సంధివద్ద ఇరాన్ తీరంలోని క్షిపణి ప్రయోగ కేంద్రాలపై అమెరికా అతి పెద్ద బంకర్ బస్టర్ బాంబులతో దాడి చేసింది. 2,268 కేజీల బరువున్న ఈ బాంబులను అమెరికా ఇరాన్‌పై వేయడం ఇది ఇటీవలి కాలంలో రెండోసారి.

చమురు, గ్యాస్ క్షేత్రాలపై దాడుల కారణంగా ముడిచమురు ధర మళ్లీ పెరిగింది. 110డాలర్లకు చేరుకుంది.

**మంత్రి మరణం..**

ఇరాన్ నిఘాశాఖ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌ను మంగళవారం రాత్రి జరిగిన దాడుల్లో చంపేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తెలిపారు. మరిన్ని ఆశ్చర్యకర వార్తలనూ వింటారని ఆయన పేర్కొన్నారు. ఖతీబ్ మృతిని ఇరాన్ ధ్రువీకరించింది. ఆయనతోపాటు సీనియర్ అధికారులు మరణించారని తెలిపింది. పిరికి దాడులకు ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. ఖతీబ్ మృతికి సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సంతాపం తెలిపారు. మంగళవారం జరిగిన దాడుల్లో ఇరాన్ భద్రతాధికారి లారిజానీ, బసీజ్ దళం అధిపతి గులాం రెజా మరణించిన సంగతి తెలిసిందే. తమకు వ్యతిరేకంగా సైబర్ నేరాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఖతీబ్‌పై 2022లో అమెరికా ఆంక్షలు విధించింది.

లారిజానీ, ఆయన కుమారుడి మృతిపట్ల మొజ్తాబా సంతాపం తెలిపారు. 5 దశాబ్దాలపాటు ఆయన రాజకీయంగా, సైనికపరంగా, భద్రతాపరంగా, సాంస్కృతిక పరంగా, పాలనాపరంగా సేవలందించారని కొనియాడారు. ఆయన మృతికి కారకులైన వారికి శిక్ష తప్పదన్నారు.

ఇరాన్‌లోని బుషెహర్ అణు కేంద్రంపై ప్రొజెక్టైల్‌తో దాడి జరిగింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థకు (ఐఏఈఏ) ఈ దాడి గురించి ఇరాన్ సమాచారం ఇచ్చింది. పక్కనే తాము నిర్వహిస్తున్న అణు విద్యుత్తు ప్లాంటు ఉండటంతో రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్లాంటులో 480 మంది రష్యన్లు పని చేస్తున్నారు. రష్యా స్వల్పంగా శుద్ధి చేసిన యురేనియంతో ఇది నడుస్తోంది. ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదం లేదని రష్యా వెల్లడించింది.

బుషెహర్ అణు విద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికాలు చేసిన దాడిని రష్యా ఖండించింది. 'బాధ్యతా రహితమైన ఈ క్షిపణి దాడిని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. అణు విద్యుదుత్పాదన యూనిట్‌కు కొన్ని మీటర్ల దూరంలో క్షిపణి పేలింది' అని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా షరపోవా పేర్కొన్నారు. పరిశ్రమలపై ఇజ్రాయెల్, అమెరికాలు చేస్తున్న దాడులు పర్యావరణ విధ్వంసానికి దారితీస్తున్నాయని, ఆ కారణంగా దాడుల్ని తక్షణం నిలిపివేయాలని ఇజ్రాయెల్ రాయబారికి రష్యా ప్రభుత్వం స్పష్టం చేసింది. రష్యా విదేశాంగ ఉప మంత్రి జార్జీ బోరిసెంకో బుధవారం మాస్కోలో ఇజ్రాయెల్ రాయబారి ఓడెడ్ యూసెఫ్‌ను కలిశారు.

ఇరాన్‌లోని అతి పెద్ద దక్షిణ పార్స్ సహజ వాయువు క్షేత్రాలపై భారీ దాడులు జరిగాయి. అసాలుయే, దక్షిణ బుషెహర్‌లలో క్షేత్రాలపై ఈ దాడులు జరిగాయి. అయితే నష్టంపై వివరాలు అందలేదు.

లారిస్థాన్‌లోని జ్యుడీషియల్ కాంప్లెక్స్‌పై ఉద్యోగులు విధుల్లో ఉండగా దాడులు జరిగాయి. ఈ ఘటనలో 8 మంది ఉద్యోగులు, పౌరులు చనిపోయినట్లు సమాచారం.

లెబనాన్ రాజధాని బీరుట్‌లోని పలు అపార్ట్‌మెంట్లపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. బెకా వ్యాలీపైనా దాడులు చేసింది. ఈ దాడుల్లో డజను మంది వరకూ మరణించారు. యుద్ధం కారణంగా ఇప్పటిదాకా లెబనాన్‌లో 912 మంది మృతి చెందారు. 2,221 మంది గాయపడ్డారు.

సెంట్రల్ బీరుట్‌లో జరిగిన దాడిలో అల్-మనార్ టీవీ రాజకీయ విభాగం హెడ్ మహమ్మద్ షెర్రి, ఆయన భార్య మరణించారు. ఆయన పిల్లలు, మనవళ్లు గాయపడ్డారు.

ఇజ్రాయెల్ దాడితో లెబనాన్‌లోని సెంట్రల్ బీరుట్‌లోని ఓ భవనంలో చెలరేగిన మంటలు

**చమురు క్షేత్రాలపై...**

అనేక చమురు క్షేత్రాలున్న సౌదీ అరేబియాలోని తూర్పు ప్రావిన్స్, కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లపై ఇరాన్ దాడులు చేసింది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌కి సమీపంలో ఉన్న తమ స్థావరంపై ప్రొజెక్టైల్‌తో దాడి జరిగినట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్ తెలిపారు. స్వల్పంగా మంటలు చెలరేగినట్లు వెల్లడించారు.

దుబాయ్ గగనతలంలోనూ క్షిపణులను రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి.

ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపైకి దూసుకొచ్చిన క్షిపణిని సౌదీ అరేబియా అడ్డుకుంది. ఇది అమెరికా స్థావరం. రియాద్‌లో అమెరికా ఎంబసీతోపాటు విదేశీ దౌత్య కార్యాలయాలున్న ప్రాంతంపై రెండు డ్రోన్లతో ఇరాన్ దాడులు చేసింది. బుధవారం సాయంత్రం రియాద్‌లో రెండు భారీ పేలుళ్లు సంభవించాయి.

సెంట్రల్ ఇజ్రాయెల్‌పై అత్యాధునిక వార్ హెడ్లతో ఇరాన్ దాడి చేసింది. ఇవి రక్షణ వ్యవస్థలను, రాడార్ సిస్టంను దాటి వెళ్తాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ అధికారి ఒకరు తెలిపారు. ఖొర్రంషహర్-4, ఖాదర్ బహుళ వార్‌హెడ్లను ప్రయోగించామని వెల్లడించారు. ఇందులో ఒక క్షిపణి.. ఇజ్రాయెల్‌లో క్లస్టర్ పేలుళ్లను సృష్టించింది. టెల్ అవీవ్‌లోని రమత్ గన్‌లో ఇద్దరు మరణించారు. ఇరాన్ దాడి కారణంగా పడిన శకలాలతో బెన్ గురియన్ విమానాశ్రయంలో 3 ప్రైవేటు విమానాలు ధ్వంసమయ్యాయి.

ఇరాక్‌లోని బాగ్దాద్‌లో ఉన్న అమెరికా ఎంబసీపై వరుసగా రెండో రోజూ దాడి జరిగింది.

సౌదీ అరేబియాలోని సంరీఫ్ రిఫైనరీ, జుబైల్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, యూఏఈలోని అల్ హసన్ గ్యాస్ ఫీల్డ్, ఖతార్‌లోని పెట్రో కెమికల్ ప్లాంట్లు, రిఫైనరీపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది.

ఇరాన్‌లోని సౌత్ పార్స్ క్షేత్రంపై దాడిని ఖతార్ ఖండించింది. ఈ క్షేత్రం ఖతార్ తీరంతో అనుసంధానమై ఉంటుంది. ఇంధన వనరులపై దాడులతో ప్రపంచ ఇంధన భద్రతకు ముప్పు అని ఖతార్ స్పష్టం చేసింది.

ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు గూఢచారిగా పనిచేస్తున్నారనే ఆరోపణలతో ఒక వ్యక్తిని ఇరాన్ ఉరి తీసింది.

**తీవ్ర ప్రతీకారం తప్పదు: ఇరాన్**

లారిజానీ మృతిని ఇరాన్ ధ్రువీకరించింది. ఆయనకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా ఉన్నతాధికారులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తీవ్ర ప్రతీకారాన్ని ఎదుర్కొంటారని హెచ్చరించారు. లారిజానీ, ఆయన కుమారుడు, ఇతర భద్రతా సిబ్బంది, బసీజ్ దళం చీఫ్ గులాం రెజా సాల్మనీ అమరులయ్యారని ఇరాన్ భద్రతా మండలి పేర్కొంది. తమ పోరాటం ఆగిపోదని, తమ ప్రభుత్వం బలంగా నిర్మితమై ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఎక్కడున్నా అంతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది.

ఇరాన్ మహిళా సాకర్ బృందం ఎట్టకేలకు స్వదేశానికి చేరుకుంది. ఆస్ట్రేలియాలో చిక్కుకుపోయిన వారు.. మలేసియాకు ఎలాగోలా చేరుకున్నారు. అక్కడి నుంచి స్వదేశానికి వచ్చారు.

మొదలైన చమురు రవాణా

హర్మూజ్‌లో స్వల్పంగా నౌకల రవాణా మొదలైంది. సోమవారం ఇరాన్‌కు సంబంధం లేని 8 నౌకలు ఈ మార్గంలో కనిపించాయి.

తుర్కియేలోని సీహాన్ పోర్టుకు పైపులైన్‌ద్వారా కిర్కుక్ నుంచి చమురు రవాణాను పునరుద్ధరించినట్లు ఇరాన్ తెలిపింది. కుర్దిష్ పాలకులతో చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో పర్షియన్ గల్ఫ్ అవసరం ఆ దేశానికి ఉండదు. సౌదీ అరేబియా హర్మూజ్‌ను వదిలేసి ఎర్ర సముద్రం నుంచి పైప్‌లైను ద్వారా చమురును రవాణా చేస్తోంది.

# రూ.1000 ఈపీఎఫ్ పెన్షన్ ఒక జోక్

ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్) కనీస పెన్షన్ ఇప్పటికీ రూ.1000 మాత్రమే ఉండటం ఒక జోక్ లాంటిదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తప్పకుండా తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేసింది. పెరిగిన ధరల దృష్ట్యా ఈపీఎఫ్ కనీస పెన్షన్ సరిపోదని, దీన్ని గౌరవప్రదమైన స్థాయికి పెంచాలని ఓ పార్లమెంటరీ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు 12 ఏళ్ల మోదీ పాలనలో చాలా సామాజిక భద్రతా పథకాలను క్రమంగా బలహీనపర్చడం లేదా ఉద్దేశపూర్వకంగా విస్మరించడం జరిగిందని ఆయన ఆరోపించారు. ద్రవ్యోల్బణం పెరుగుతూపోతున్నా, ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను ఇప్పటిదాకా అస్సలు పెంచలేదన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా హిందీలో ట్వీట్ చేశారు.

**భారీ ద్రవ్యోల్బణంలో, అతి తక్కువ పెన్షన్**

"ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం - 1995 ప్రకారం ఇప్పుడున్న కనీస నెలవారీ పెన్షన్ రూ.1000పై వెంటనే సమీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. కేవలం వెయ్యి రూపాయల కనీస పెన్షన్ నేటి అవసరాలను తీర్చలేదని కమిటీ నివేదించింది. నేటి జీవన వ్యయాలకు తగిన విధంగా, పెన్షనర్ల గౌరవప్రదమైన జీవితానికి ఉపయోగపడే స్థాయికి కనీస పెన్షన్‌ను పెంచాలని ఆ కమిటీ ప్రభుత్వానికి సూచించింది. కనీస పెన్షన్ ఇంత తక్కువగా ఉండటం వృద్ధులు, ఆర్థికంగా బలహీనులైన పెన్షనర్లను నేరుగా ప్రభావితం చేసింది. కేంద్ర ప్రభుత్వం తప్పుడు విధానాల వల్ల ఇప్పుడు ద్రవ్యోల్బణం తీవ్రస్థాయిలకు పెరిగిపోయింది. ఆరోగ్యసంరక్షణ వ్యయాలు కూడా చుక్కలను అంటాయి. నిత్యావసరాల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.1000 మాత్రమే ఉండటం ఒక జోక్ లాంటిది" అని ట్వీట్‌లో జైరాం రమేశ్ పేర్కొన్నారు.



మోదీ సరకార కే పిఛలే లగభగ 12 సాల కే కార్యకాల మేం సామాజిక సురక్షా కీ కఈ యోజనాఏం ధీరే-ధీరే కమజోర హోతీ చలీ గఈ హైం, యా ఉన్హేం జానబూఝకర కమజోర కర దియా గయా హై।

పేంశన జైసీ బునియాదీ సువిధా భీ లంబే సమయ సే బఢ?తీ మహంగాఈ కే బావజూద లగభగ జస కీ తస బనీ హుఈ హై।

ఈ నివేదికతోనైనా ప్రభుత్వం చర్యలను చేపట్టాలి

"ఈపీఎఫ్ కనీస పెన్షన్ అంశం అనేది సామాజిక భద్రత, కోట్లాది మంది రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగుల గౌరవప్రదమైన జీవితాలతో ముడిపడినది. కార్మికులు, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఒక బీజేపీ లోక్‌సభ ఎంపీ సారథ్యంలో ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రూపొందించిన ఈ నివేదిక ఆధారంగానైనా ప్రభుత్వం చర్యలను చేపట్టాలి. ఇప్పటికైనా సర్కారు మేల్కొనాలి. కనీస పెన్షన్ పెంపు దిశగా అడుగులు వేయాలి" అని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

కార్మిక సంఘాల డిమాండ్ : పార్లమెంటరీ కమిటీ అధ్యయనం

కార్మికులు, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గ్రాంట్ల డిమాండ్లపై 15వ నివేదికను ఇటీవలే కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ప్రస్తుతం రూ.1000గా ఉన్న ఈపీఎఫ్ కనీస పెన్షన్‌పై వెంటనే సమీక్ష నిర్వహించాలని సర్కారుకు సిఫారసు చేసింది. ఈపీఎఫ్ కనీస నెలవారీ పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈమేరకు డిమాండ్‌తో మార్చి 9న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మూడు రోజులు నిరసన తెలిపాయి. ఏళ్లు గడిచినా, జీవన వ్యయాలు, నిత్యావసరాల ధరలు భారీగా పెరిగినా కనీస పెన్షన్‌ను అందుకు అనుగుణంగా పెంచకపోవడాన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలు తప్పుపడుతున్నాయి. దీనిపై ఈ సంఘాలు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పెద్దసంఖ్యలో వినతిపత్రాలను సమర్పించాయి. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వృద్ధులు, నిరుపేద వర్గాల పెన్షనర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈపీఎఫ్ కనీస నెలవారీ పెన్షన్‌ను పెంచాలని కోరాయి. ఇదే అంశంపై కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ కూడా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి తన వాదనను వినిపించింది. ప్రస్తుతం ఈపీఎఫ్ పరిధిలో ఉన్న సభ్యులందరికీ 1.16 శాతం చొప్పున కంట్రిబ్యూషన్‌ను అందిస్తున్నామని కార్మిక శాఖ తెలిపింది. దీంతోపాటు ప్రతినెలా రూ.1000 కనీస పెన్షన్ చెల్లింపునకు నిధులనూ ప్రభుత్వమే సమకూరుస్తోందని పేర్కొంది. అయినప్పటికీ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం పక్షానే పార్లమెంటరీ కమిటీ సిఫారసులు చేసింది. నెలవారీ కనీస పెన్షన్‌ను పెంచాలని కోరింది.

## పార్లమెంట్ అంటే ఓపెన్ యూనివర్సిటీ



న్యూఢిల్లీ

పార్లమెంట్ అంటే ఒక ఓపెన్ యూనివర్సిటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పార్లమెంట్ సభ్యత్వం ముగిసినప్పటికీ సభ్యులు ప్రజా జీవితంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూనే ఉండాలని అన్నారు. రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ఉద్ఘాటించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు రాజ్యసభ సభ్యత్వం ముగుస్తున్న 59 మంది సభ్యులు ఇన్నాళ్లూ అందించిన సేవలను ప్రధానమంత్రి కొనియాడారు. ఆయా సభ్యులకు బుధవారం రాజ్యసభలో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించిన ప్రధాని మోదీ మాట్లాడారు. ఇలాంటి వీడ్కోలు సందర్భాలు సహజంగానే రాజకీయ విభేదాలను తొలగిస్తాయని అన్నారు. సహజంగా, అప్రయత్నంగా రాజకీయ విభేదాలకు అతీతంగా వ్యవహరిస్తామని, మనందరిలో ఒక ఉమ్మడి భావన ఉద్భవిస్తుందని వ్యాఖ్యానించారు. సభకు ఇక తిరిగి వచ్చే ఆలోచన లేని సభ్యులకు భరోసా ఇచ్చారు. రాజకీయాల్లో పూర్తి విరామం అనేది ఎప్పుడూ ఉండదన్నారు. భవిష్యత్తు మీ కోసం ఎదురుచూస్తోందని సూచించారు. మీ అనుభవం, సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని స్పష్టంచేశారు. మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌పై మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాజకీయ దిగ్గజాలైన ఆ ముగ్గురు నేతలు జీవితంలో సగానికి కంటే ఎక్కువ భాగం పార్లమెంట్ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారని చెప్పారు. అంకితభావంతో పార్లమెంట్‌కు హాజరయ్యారని, వారి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యులుగా కొనసాగడం సాధారణ విషయం కాదన్నారు.

**మాతో ప్రేమ, మోదీతో పెళ్లి: ఖర్గే**

రాజ్యసభ కార్యకలాపాల నిబంధనలను సమీక్షించాలని సభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కోరారు. సభను మరిన్ని ఎక్కువ రోజులు కొనసాగిస్తే ప్రజా సమస్యలు విస్తృతంగా చర్చకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. చట్టాల రూపకల్పనలో ప్రతిపక్ష సభ్యుల భాగస్వామ్యం మరింత పెరగాలని అభిప్రాయపడ్డారు. లేకపోతే పార్లమెంట్ ప్రతిష్ట బలహీనపడుతుందని చెప్పారు. 59 మంది సభ్యుల వీడ్కోలుపై ఖర్గే మాట్లాడారు. రాజకీయాల్లో ఉన్నవారికి ప్రజాజీవితం నుంచి రిటైర్‌మెంట్ ఉండదని వ్యాఖ్యానించారు. దేశానికి సేవ చేయాలన్న తపన కలిగిన నాయకులు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని వ్యాఖ్యానించారు. రాజ్యసభ సభ్యత్వం ముగు స్తున్న సభ్యులు ప్రజలకు ఎప్పటిలాగే సేవలందిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. మాజీ ప్రధాని దేవెగౌడ తనకు 54 ఏళ్లుగా తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని అన్నారు. ఏం జరిగిందో తెలియదు గానీ దేవెగౌడ తమతో డేటింగ్ చేసి, ప్రేమాయణం సాగించి, చివరికి మోదీని పెళ్లి చేసుకున్నారు అంటూ చమత్కరించారు. దీంతో సభలో మోదీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు.

## భారత్‌కు చేరిన జగ్ లడ్కీ




అహ్మదాబాద్/హాంకాంగ్: యుద్ధమయ హోర్మూజ్ గుండా మరో ముడిచమురు రవాణా నౌక క్షేమంగా భారత నౌకాశ్రయానికి చేరుకుంది. భారతీయ జెండాతో 'జగ్ లడ్కీ'నౌక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఫుజైరా పోర్ట్‌లో 80,886 మెట్రిక్ టన్నుల ముడిచమురు నింపుకుని హోర్మూజ్ గుండా ప్రయాణించి బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్‌కు చేరుకుందని ఆ పోర్ట్ నిర్వహణ సంస్థ 'అదానీ పోర్ట్స్'ప్రకటించింది. ఇదే ఫుజైరా పోర్ట్‌పై ఇరాన్ ఇటీవల క్షిపణి దాడులు చేసింది. అయినాసరే పోర్ట్‌నుంచి సరకు ఎగుమతి నిరాటంకంగా కొనసాగుతోంది. సోమవారం హోర్మూజ్ గుండా బయల్దేరి 46,500 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ సరకుతో 'నందా దేవి'నౌక వచి?చన మరుసటి రోజే మరో సరకు రవాణా నౌక సురక్షితంగా భారత్‌కు రావడం విశేషం. 274.19 మీటర్ల పొడవుండే జగ్ లడ్కీ నౌక గరిష్టంగా 1,64,716 టన్నుల సామర్థ్యంతో ప్రయాణించగలదు. భారత చమురు దిగుమతులకు సంబంధించి హోర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దీని గుండానే భారత్‌కు దాదాపు 40--50 శాతం చమురు వస్తోంది.

**హోర్మూజ్‌ను దాటిన 89 నౌకలు**

హోర్మూజ్ గుండా సరకు రవాణా నౌకల రాకపోకలపై ఇరాన్ నిషేధం విధించినా సరే సిగ్నళ్లను నిలిపేసి, లైట్లను ఆర్పేసి 'డార్క్ మోడ్'లో ఎవరి కంటా పడకుండా కొన్ని నౌకలు ఇదే మార్గం గుండా ప్రమాదకరరీతిలో ప్రయాణం కొనసాగిస్తున్నాయి. అయితే మిత్రదేశాలకు చెందిన నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడట్లేదని తెలుస్తోంది. భారత్, పాకిస్తాన్ జెండాతో ప్రయాణిస్తున్న నౌకలు సైతం సురక్షితంగానే ప్రయాణం పూర్తిచేస్తున్నాయి. యుద్ధం మొదలయ్యాక మార్చి ఒకటో తేదీ నుంచి మార్చి నెల 15వ తేదీదాకా 89 సరకు రవాణా నౌకలు హోర్మూజ్ గుండా విజయవంతంగా ప్రయాణించాయని సముద్రమార్గ ప్రయాణాల డేటా సంస్థ 'లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్'బుధవారం ప్రకటించింది. ఈ 89 నౌకల్లో ఐదింట ఒకవంతు నౌకలకు ఇరాన్‌తో సంబంధం ఉందని, చైనా, గ్రీస్ జెండాలున్న నౌకలూ సులభంగానే హోర్మూజ్‌ను దాటేశాయని 'లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్'పేర్కొంది.

**చైనాకు బదులు భారత్‌కు బయల్దేరిన 7 నౌకలు**


రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లపై అమెరికా తాత్కాలికంగా ఆంక్షల సడలింపు ప్రకటించిన నేపథ్యంలో మోదీ సర్కార్ మళ్లీ రష్యాచమురు కొనుగోళ్ల పర్వానికి తెరలేపింది. దీంతో రష్యా నుంచి చైనాకు బయల్దేరిన ఏడు ముడిచమురు రవాణా నౌకలు సముద్రమార్గం మధ్యలోనే దిశ మార్చుకుని భారత్‌కు ప్రయాణం మొదలెట్టడం విశేషం. జనవరి చివరివారంలో రష్యా నుంచి బయల్దేరి బాలి?టక్ సముద్రజలాల్లో ప్రయాణించిన మధ్యశ్రేణి ముడిచమురునౌక 'ఆక్వా టైటాన్'వాస్తవానికి చైనాలోని రిజావో పోర్ట్‌కు వెళ్లాలి. కానీ అది ఇటీవల దిశ మార్చుకుని భారత్ దిశగా వెళ్తోందని, మార్చి 21వ తేదీకల్లా న్యూ మంగళూరు పోర్ట్‌లో లంగరు వేస్తుందని నౌకల ట్రాకింగ్ సంస్థ 'ఓర్టెక్సా లిమిటెడ్'పేర్కొంది. 'సూయిజ్‌మ్యాక్స్ జోయూజోయూ ఎన్'నౌక సైతం దిశ మార్చుకుని భారత్‌కు వస్తోందని మార్చి 25వ తేదీకల్లా గుజరాత్‌లోని జామ్‌నగర్ సిక్కా పోర్ట్‌కు చేరుకుంటుందని తెలిపింది.

## సంపాదకీయం

# ఆర్థిక మాంద్యం తప్పదా?

పశ్చిమ ఆసియాలో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరోసారి కుదుపునకు గురవుతోంది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ప్రతిష్టంభన కేవలం ప్రాంతీయ ఉద్రిక్తత మాత్రమే కాదు, అది గ్లోబల్ ఎనర్జీ సంక్షోభానికి ప్రధాన హేతువుగా మారుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాల మధ్య కొనసాగుతున్న పోరు అంతర్జాతీయ చమురు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో బ్యారెల్‌కు 60 డాలర్లుగా ఉన్న ముడిచమురు ధర, సోమవారం నాటికి ఏకంగా 120 డాలర్లకు చేరుకోవడం ఆందోళనకరం. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ధరలు రెట్టింపు కావడం, 2022 నాటి రష్యా- ఉక్రెయిన్ యుద్ధం సృష్టించిన ప్రకంపనలను గుర్తుకు తెస్తోంది. ఇరాన్, ఒమన్ దేశాల మధ్య కేవలం 33 కిలోమీటర్ల వెడల్పున్న ఈ సన్నని జలమార్గం గుండానే ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో 20 శాతం సాగుతుంది. ప్రస్తుతం ఇక్కడ ఏర్పడిన అడ్డంకుల వల్ల కువైట్, ఇరాక్, యుఎఇ వంటి దేశాలు తమ చమురు ఎగుమతులను నిలిపివేయాల్సి వచ్చింది. సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కో సంస్థ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో సరఫరా చేయలేకపోతోంది. గ్యాస్ సరఫరాకు గ్రహణం చమురుతోపాటు ఎల్‌ఎన్‌జి సరఫరాపై కూడా నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్‌ఎన్‌జి ఎగుమతి కేంద్రమైన ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ ప్లాంట్‌పై డ్రోన్ దాడులు జరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఫలితంగా ఒక్క వారంలోనే గ్యాస్ దిగుమతులు 26% పడిపోయాయి. వేసవి సమీపిస్తున్న తరుణంలో ఆసియా దేశాలకు, నిల్వలు పెంచుకోవాల్సిన ఐరోపా దేశాలకు ఇది పెద్ద దెబ్బ. అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు గ్యాస్ కొరతను తీర్చేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, సరఫరా గొలుసు తెగిపోవడంతో అవి ఎంతవరకు సఫలమవుతాయో వేచిచూడాలి. భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నది. చమురు ధరలో ప్రతి 10 డాలర్ల పెంపు మన దేశ దిగుమతి బిల్లుపై సుమారు 12 నుండి 15 బిలియన్ డాలర్ల భారాన్ని మోపుతుంది. దీనివల్ల పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగి సామాన్యుడిపై భారం పడుతుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. ద్రవ్యోల్బణం పెరిగితే వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఉండదు. చమురు ధరలు పెరిగితే స్టాక్ మార్కెట్లు కుదేలవడం సహజం. ఈ యుద్ధం మొదలైనప్పటి నుండి భారత సెన్సెక్స్ సుమారు 5,100 పాయింట్లు నష్టపోవడం పెట్టుబడిదారుల్లో ఉన్న భయాందోళనలకు నిదర్శనం. కంపెనీల నిర్వహణ వ్యయం పెరగడం వల్ల వాటి లాభాలు తగ్గుతాయి, తద్వారా షేర్ల ధరలు పడిపోతాయి. అయితే, గతంలో సంభవించిన యుద్ధాలు, మహమ్మా రుల నుంచి మార్కెట్లు పుంజుకున్న చరిత్ర ఉంది. అందుకే ఇన్వెస్టర్లు ఆందోళనతో పెట్టుబడులను ఉపసంహరించుకోకుండా ఓపిక పట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. హర్మూజ్ జలసంధి తెరుచుకోవడంపైనే ప్రపంచ ఆర్థిక భవిష్యత్తు ఆధారపడి ఉంది. యుద్ధం త్వరగా ముగిస్తే ధరలు 65 డాలర్లకు దిగిరావచ్చు, లేదంటే 150 డాలర్లకు చేరినా ఆశ్చర్యం లేదు. అంతర్జాతీయ సమాజం సమష్టిగా స్పందించి ఈ ఉద్రిక్తతలను తగ్గించకపోతే, ప్రపంచం మరో భారీ ఆర్థిక మాంద్యంలోకి జారుకునే ప్రమాదం ఉంది. చమురు అవసరాల కోసం గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధారపడే భారత్, చైనా వంటి దేశాలకు ఈ పరిస్థితి కత్తిమీద సాములా మారింది. అయితే, భారత ప్రభుత్వం దౌత్యనీతిని ప్రదర్శించి ఇరాన్ పాలకులతో జరిపిన చర్చలు కొంత ఫలితాన్నిచ్చాయి. భారత్‌ను మిత్రదేశంగా పరిగణిస్తూ హర్మూజ్ గుండా భారత నౌకలను అనుమతించడం కొంత ఊరటనిచ్చే అంశం. అయినప్పటికీ, భవిష్యత్తులో యుద్ధ తీవ్రత పెరిగితే ఈ వెసులుబాటు ఎంతవరకు కొనసాగుతుందన్నది సందేహమే. చమురు సంక్షోభం కేవలం పెట్రోల్, డీజిల్‌కే పరిమితం కాలేదు. గ్యాస్ కొరత, ఎరువుల ధరల పెరుగుదల భారత పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా దేశంలో వంటగ్యాస్ కొరత కనిపిస్తుండటం సామాన్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. గ్యాస్ ఏజెన్సీల ముందు కనిపిస్తున్న బారులు దేనికి సంకేతం? బ్లాక్ మార్కెట్ ముఠాలు ఈ అస్తవ్యస్త పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇంకా చక్కబడలేదు. రష్యా, వెనెజువెలా వైపు భారత్ చూపు.. ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి భారత్ ఇప్పుడు రష్యా, వెనెజువెలాల వైపు మొగ్గు చూపుతోంది. రష్యా నుంచి చమురు దిగుమతులపై అమెరికా తన అభ్యంతరాలను పక్కనబెట్టడం గమనార్హం. వెనెజువెలాలో చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నా, అక్కడ నెలకొన్న రాజకీయ అస్థిరత, చమురు శుద్ధిలో ఉన్న సాంకేతిక ఇబ్బందులు భారత్‌కు సవాల్‌గా మారాయి. ఈ గందరగోళానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొండివైఖరే ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. యుద్ధం వల్ల తలెత్తే పరిణామాలను అంచనా వేయకుండా, ఆధిపత్య పోరులో భాగంగా దాడులకు దిగడం అమెరికా స్వయంకృతాపరాధమే. ఇరాన్‌లో మార్పు కోసం అమెరికా వేసిన ఎత్తుగడలు ఫలించకపోగా, యుద్ధం మరింత కాలం కొనసాగేలా కనిపిస్తోంది. అంతర్జాతీయ శక్తి సంస్థ (ఐఇఎ) అత్యవసర నిల్వల నుంచి చమురును విడుదల చేసినప్పటికీ ధరలు 100 డాలర్ల మార్కును దాటాయి. యుద్ధం ముగిసి, సరఫరా వ్యవస్థలు పునరుద్ధరించబడే వరకు ప్రపంచానికి ఇంధన గండం పొంచే ఉంటుంది. అగ్రరాజ్యాలు తమ పంతాలను వీడి శాంతి మార్గంలో పయనించకుంటే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకోలేని దెబ్బ తినడం ఖాయం.

# రాజకీయ అనుభవశాలి కృపలానీ



ఆచార్య జె. బి. కృపలానీ (1888-1982) సుప్రసిద్ధ భారతీయ రాజకీయ నాయకుడు, గాంధేయవాది, సోషలిస్టు, పర్యావరణవేత్త , స్వాతంత్ర్య సమరయోధుడు, చరిత్రకారుడు, పండితుడు, ఉపాధ్యాయుడు, రచయిత, మహాత్మా గాంధీ తొలి సహచరులు. గాంధీకి అత్యంత సన్నిహితులలో ఒకనిగా పేరు గాంచారు. 1947 భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షునిగా ఉన్నారు. 1951, 1957, 1963, 1967 లో లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యా రు. కృపలానీ ఆపద్ధర్మ భారత ప్రభుత్వము (1946-1947) లోనూ, భారత రాజ్యాంగ సభలోనూ పనిచేశారు. ఆచార్య కృపాలనీ నాటి సింధు (నేటి పాకిస్తాన్) ప్రాంతంలోని హైదరాబాదులో 1888లో జన్మించారు. అతని పూర్వీకులు గుజరాతీ, సింధీ సంతతులకు చెందినవారు. కరాచి డి.జె. సైన్సు కళాశాలలో, ఆయన రాజకీయాలలో చురుగ్గా పాల్గొం టున్నందుకు కళాశాల నుంచి బహిష్కరించారు. కృపలానీ పూణేలోని ఫెర్గూసన్ కాలేజీ నుండి చరిత్ర, ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేసి 1912 లో బోధన ప్రారంభించారు.గాంధీ దక్షిణ ఆఫ్రికా నుండి వచ్చిన తరువాత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయు లుగా ఉన్న సమయం లోనే ఆయనకు మొదటి సారి గాంధీని కలిశారు. గాంధీని కలిసిన తరువాత కృపాలని కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుజరాత్, మహారాష్ట్ర, బీహార్లలో గాంధీ ఆశ్రమాలలో పని చేశారు.కృపలానీ 1920వ దశకపు తొలి నాళ్ళలో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. గుజరాత్, మహా రాష్ట్ర లోని గాంధీ ఆశ్రమాలలో సంఘ సంస్కరణ , విద్యా సంబంధ విషయాలపై కృషి చేశారు. ఆ తరువాత ఉత్తర భారత దేశంలోని బీహార్ , సంయుక్త రాష్ట్రాలలో అదే తరహా ఆశ్రమాలు స్థాపించి బోధించడానికి వెళ్ళారు. పౌర నిరసనోద్యమం లోనూ , ఇతర అనేక చిన్న సందర్భాలలోనూ బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలను నిర్వహించిన, ఉద్రేకపూరిత సాహిత్యాన్ని ప్రచురించిన అనేక సందర్భాలలో కృపలానీ జైలుకు వెళ్ళారు. 1922 నుండి 1927 వరకు గాంధీ స్థాపించిన అహ్మదాబాద్‌లోని గుజరాత్ విద్యాపీఠ్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఆచార్య అనే బిరుదును పొందారు.కృపలానీ అఖిల భారత కాంగ్రేసు కమిటీలో చేరి 1928-29లో దాని ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఒక దశాబ్దము పైగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత స్థాయి కార్య కలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమ నిర్వహణలో ప్రధానపాత్ర పోషించారు. 1934-1935 మధ్య కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కూడా పని చేశారు. తరువాత 1946 లో పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సైద్ధాంతికంగా వల్లభ్ భాయి పటేల్‌తోనూ, జవహర్ లాల్ నెహ్రూ తోనూ విరుద్ధముగా ఉన్నప్పటికీ, కృపలానీ 1947లో భారత స్వాతంత్ర్యానికి అటునిటు క్లిష్టమైన సంవత్సరాలలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1948 జనవరిలో గాంధీ హత్య తర్వాత, అన్ని ప్రభుత్వ నిర్ణయాలలో పార్టీ యొక్క అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకోవాలన్న కృపలానీ కోరికను నెహ్రూ తోసిరాజన్నారు. నెహ్రూ, పటేల్ మద్దతును కూడగట్టుకొని, "పార్టీకి విస్తృతమైన మార్గ దర్శకాలు, మూల సూత్రాలను నిర్దేశించే అధికారము కలిగి ఉన్నా, ప్రభుత్వ దైనందిన వ్యవహారాలలో కలుగ జేసుకొనే అధికారాన్ని పార్టీకి ఇవ్వలేమని" కృపలానీకి సమాధాన మిచ్చారు. సదరు పూర్వ ప్రమాణమే ఆ తర్వాత దశాబ్దాలలో ప్రభుత్వము , పాలక పార్టీ యొక్క సంబంధానికి కేంద్ర హేతువు అయ్యింది. గాంధీ ఆశయమైన గ్రామ స్వరాజ్యానికి తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణతో కాంగ్రెస్ పార్టీని విడిచి, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ యొక్క సంస్థాపకుల్లో ఒకరైనారు. ఆ పార్టీ ఆ తరువాత సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమై ప్రజా సోషలిస్టు పార్టీగా అవతరించింది. కృపలానీ తన రాజకీయ శేష జీవిత మంతా ప్రతిపక్షము. లోనే గడిపారు. 1938 నుండి ఆయన భార్య సుచేతా కృపలానీ, కాంగ్రేసు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రివర్గములో అనేక మార్లు మంత్రి పదవులతో సహా అనేక ఉన్నత పదవులు పొందారు. ఆమె దేశము లోనే మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉత్తర ప్రదేశ్ లో ప్రమాణ స్వీకారం చేశారు. కృపలానీ 1963 ఆగస్టులో భారత - చైనా యుద్ధం ముగియగానే నెహ్రూ ప్రభుత్వముపై లోక్ సభలో మొట్ట మొదటి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమాజిక , పర్యావరణ విషయాలపై పనిచేస్తూ కృపలానీ జీవితాంతము నెహ్రూ, ఇందిరల పాలనా, విధానాల విమర్శకునిగా మిగిలి పోయారు. క్రియాశీలక ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతూనే, కృపలానీ క్రమేణ రాజకీయ నాయకుడిగా కంటే కమ్యూనిస్టుల ఆధ్యాత్మిక గురువుగా పరిణతి చెందారు. ముఖ్యంగా వినోబా భావేతో పాటు కృపలానీని అంతరించి పోతున్న గాంధేయవాదుల వర్గానికి నాయకులుగా భావిస్తారు. 1970 లలో వినోభా భావేతో పాటు ఈయన అనేక పరిరక్షణ , సంరక్షణా కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కూతురు ఇందిరా గాంధీ పాలనలను విమర్శించారు. ఆయా పాలనకు గ్రామీణ గణతంత్రాల, గాంధేయ ఆదర్శానికి విరుద్ధంగా ఉందని భావించారు. 1972-73లో, కృపలానీ, జయ ప్రకాశ్ నారాయణ్‌లు ఇందిరా గాంధీ పాలన నియంతృత్వంగా, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ఉందని భావించి, ప్రధాని ఇందిర పాలనపై నిరసన ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ యంత్రాగాన్ని ఉపయోగించు కుందన్న అభియోగము న్యాయ స్థానములో నిర్ధారణ కావడంతో, రాజకీయ ప్రతిపక్షాలు ఆమెకు వ్యతిరేకంగా మరింత ముందుకు సాగాయి. జయప్రకాష్ నారాయణ్‌తో పాటు, 1972-73లో ఇందిరా గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అహింసాత్మక నిరసన, శాసనోల్లంఘనను కోరుతూ కృపాలాని భారతదేశంలో పర్యటించారు. 1975లో అత్యయిక పరిస్థితిని విధించినప్పుడు పెద్ద ఎత్తున నిరసన రేపడానికి కారకులు అయినారనే నెపంతో, జూన్ 26, 1975 రాత్రి అరెస్టు చేయబడిన మొట్ట మొదటి ప్రతిపక్ష నాయకుల్లో 80 యేళ్ళు పైబడిన కృపలానీ ఒకరు. ఎమర్జెన్సీ అంతం కావడం, 1977 ఎన్నికల్లో జనతా పార్టీ గెలుపొంది స్వాతంత్ర్యానంతరం మొట్ట మొదటి సారిగా ఒక కాంగ్రెసేతర ప్రభుత్వం నెలకొల్పటం చూడటానికి కృపలానీ జీవించే ఉన్నారు. లోహియా గాంధేయ తత్వ శాస్త్రాలపై కొన్ని పుస్తకాలు కూడా రాశారు; "అహింసా విప్లవం", "గాంధేయ వే", "ది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్", "ది ఫేట్ఫుల్ ఇయర్స్", "ది పాలిటిక్స్ ఆఫ్ చక్ర", "ది ఫాదర్ ఆఫ్ ది కాంగ్రెస్", "గాంధేయ విమర్శ" ముఖ్యమైనవి. కృపలానీ 94 యేళ్ళ వయసులో 1982, మార్చి 19న మరణించారు.

# మాడభూషి జీవితం నేటి తరానికి ఆదర్శం



మాడభూషి అనంత శయనం అయ్యంగార్ ప్రముఖ న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా, అత్యుత్తమ పార్లమెంటు సభ్యుడిగా, వక్తగా, విశిష్ట పండితుడిగా, లోకసభ స్పీకర్‌గా, పాత తరానికి చెందిన జాతీయ నాయకులలో విశిష్ట స్థానం దక్కించు కున్నారు. అయ్యంగార్ 1891 ఫిబ్రవరి 4న ఆంధ్రప్రదేశ్ లోని ఆధ్యాత్మిక పట్టణం తిరుపతి సమీపంలో తిరుచనూరులో జన్మించారు. తిరుపతిలోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ప్రారంభ విద్యను పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం మద్రాసుకు వెళ్లారు. మద్రాసులోని పచయ్యప్ప కళాశాల నుండి బిఎ పట్టా పొందిన తరువాత, 1913 లో మద్రాస్ లా కాలేజీ నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1912 లో గణిత విషయ ఉపాధ్యాయుడిగా నియుక్తులై, 1915లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. స్వల్ప వ్యవధిలో, ఒక ప్రొఫెషనల్ న్యాయవాదిగా, అసాధారణ సామర్థ్యంతో ఖ్యాతిని పొందారు. జీవనోపాధిని సంపాదించే సాధనంగా మాత్రమే న్యాయవాద వృత్తిని చూడక, భారత ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశ న్యాయ వ్యవస్థను మెరుగు పరచడంలో ఆసక్తి చూపారు. అయ్యంగార్ చాలా చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రవేశించారు. తన సొంత రాష్ట్రంలోనే, బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో ఉండి, పోరాడటమే లక్ష్యంగా, 1934 లో కేంద్ర శాసనసభ ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించు కున్నప్పుడు, అయ్యంగార్ అధిక మెజారిటీతో సభకు ఎన్నికయ్యారు. వాస్తవాలు మరియు గణాంకాలతో అతని సహజమైన చర్చా నైపుణ్యాల ద్వారా, అయ్యంగార్ త్వరలోనే అసెంబ్లీలో తన వాదనా పటిమతో తనదైన ముద్ర వేశారు. మొదట వ్యక్తిగత సత్యాగ్రహ ప్రచారంలో తరువాత 1942 'క్విట్ ఇండియా ఉద్యమంలో' పాల్గొన్నందుకు 1940, 1944 మధ్య అయ్యంగార్ దాదాపు మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. రాజకీయ స్వేచ్ఛ కోసం ఉద్యమంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా, సమాజం లోని అణగారిన వర్గాల, సామాజిక విముక్తి దిశగా, నిర్దేశించిన వివిధ కార్యకలాపాలలో అయ్యంగార్ పాల్గొన్నారు. అంటరాని సామర్థ్యం వంటి సామాజిక చెడులతో పోరాడటానికి గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాల నుండి ప్రేరణ పొందిన అయ్యంగార్, హరిజనులకు ఆలయ ప్రవేశం, అంటరాని తనం నిర్మూలన కోసం ఉద్యమాలలో ముందంజలో ఉన్నారు. తరువాత, హరిజన్ సేవక్ సంఘ అధ్యక్షుడిగా తమ సామర్థ్యంలో, హరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఆయన మొట్టమొదటి సారిగా చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ కు ఎన్నిక అయ్యారు. తరువాత, చిత్తూరు కో - ఆపరేటివ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎంపిక అయినారు. 1946-47 మధ్య కాలంలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కూడా పని చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యునిగా పని చేశారు. జి.వి.మవలంకర్‌ను రాజ్యాంగ అసెంబ్లీ (శాసనసభ) స్పీకర్‌గా ఎన్నుకున్న నేపథ్యంలో, అయ్యంగార్‌ను దాని డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ స్టీరింగ్ కమిటీలో కూడా పని చేశారు. 1950-52 మధ్య కాలంలో అయ్యంగార్ తాత్కాలిక పార్లమెంటు డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. 1950 లో తాత్కాలిక పార్లమెంట్ మొదటి అంచనా కమిటీకి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. సమావేశాలను నైపుణ్యంగా నిర్వహించారు. అయ్యంగార్ గొప్ప, సమర్థ వంతమైన పార్లమెంటు సభ్యుడని నిరూపించు కున్నారు. పార్లమెంటరీ నిబంధనలను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్నారు. 1957 లో రెండవ లోక్‌సభ ఏర్పడినప్పుడు, అయ్యంగార్ ఐదేళ్లపాటు ఆయనను స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్టాండింగ్ కమిటీలు, కాలింగ్ అటెన్షన్ నోటీసులు మొదలైన వాటిపై అయ్యంగార్ పద్ధతి అనుసరణీయంగా మారింది. 1960 లో టోక్యోలో జరిగిన 49 వ ఇంటర్ పార్లమెంటరీ సమావేశానికి భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకుడిగా పనిచేసిన ఆయన, భారతదేశం లోని శాసనసభల ప్రిసైడింగ్ అధికారుల సమావేశాల నిర్వహణలో ఆసక్తి చూపారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో అయ్యంగార్ మూడవ సారి లోక్‌సభకు ఎన్నికైనా, బీహార్ గవర్నర్‌గా పనిచేయడానికి వీలుగా ఆయన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాదాపు మూడు దశాబ్దాల విశిష్ట పార్లమెంటరీ జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టిన తరువాత, హరిజన్ సేవక్ సంఘ్, రామ్ విలాస్ సభ, చిత్తూరు డ్రామాటిక్ అసోసియేషన్స్, కాన్స్టిట్యూషన్ క్లబ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఫెడరల్ గవర్నమెంట్ తదితర సామాజిక - సాంస్కృతిక, విద్యా సంస్థలతో సంబంధం కొనసాగించారు. పార్లమెంటరీ జీవితం తరువాత, తన జీవితాంతం అయ్యంగార్ ఫిలాసఫీ, సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి అధ్యయనం ప్రచారం పట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపారు. కొంతకాలం సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగా, రిషికుల్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్‌గా పనిచేశారు. భారత పార్లమెంటుపై ఒక పుస్తకాన్ని కూడా రాశారు.మతాలు ప్రధానంగా మనిషికి, మనిషికి మధ్య ఉన్న తేడాలను తొలగించడానికి, మనిషిలో సోదర భావనను పెంపొందించ డానికి తద్వారా అతన్ని ఉద్ధరించడానికి సహాయపడతాయని నమ్మారు. అయ్యంగార్ ప్రకారం, ఉన్నత కులం లేదా తక్కువ కులం వంటివి ఏవీ లేవు, కానీ ఉన్నత చైతన్యం, తక్కువ చైతన్యం మాత్రమే ఉన్నాయి, ఈ రెండింటికి పుట్టుకతో సంబంధం లేదు. పుట్టుక ప్రాతిపదికన ఆరాధన హక్కును తిరస్కరించడం దైవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని నమ్మారు. ఈ నమ్మకమే హిందూ దేవాలయాల లోకి ప్రవేశించాలన్న దళితుల వాదనకు మద్దతు ఇవ్వడానికి అతన్ని ప్రేరేపించింది. బీహార్ గవర్నర్‌గా పూర్తికాలం పనిచేసిన తరువాత, శేష జీవితం గడపడానికి తన స్వగ్రామమైన తిరుపతికి తిరిగి వచ్చి, అయ్యంగార్ 1978 మార్చి 19 న తన 87 వ ఏట చివరి శ్వాస తీసుకునే వరకు సేవలు అందించారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు.

# తమలపాకుల సీక్రెట్స్..



భారతీయ సంస్కృతిలో తమలపాకులకు విశిష్ట స్థానం ఉంది. తమలపాకు సంప్రదాయంగా శుభకార్యాల్లో బంధాలను సూచిస్తుంది. ఇది జీర్ణక్రియకు అద్భుతమైన ఔషధం. కాల్షియం గ్రహణానికి, పిల్లల్లో కడుపు నొప్పికి, కళ్ల వేడి తగ్గించడానికి తమలపాకును పలు రకాలుగా ఉపయోగిస్తారు. అయితే, దీనిని ఔషధంగా వాడాలి తప్ప అలవాటుగా మార్చుకోకూడదంటున్నారు ఆరోగ్య, ఆయుర్వేద నిపుణులు.. తమలపాకు, భారతీయ సంస్కృతిలో ప్రాముఖ్యత కలిగిన ఒక మొక్క.. శుభకార్యాల నుండి వ్యాపార ఒప్పందాల వరకు తాంబూలం మార్పిడి ద్వారా బంధాలను, విశ్వాసాన్ని వ్యక్తం చేసే ఒక సంప్రదాయంగా ఇది వేళ్లూనుకుంది. తమలపాకు కేవలం ఆచార వ్యవహారాలకు మాత్రమే పరిమితం కాకుండా, అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఎన్నో ఔషధ గుణాలు దాగున్న తమలపాకు.. బహుళ ప్రయోజనాలను అందిస్తుందని.. ఆరోగ్యానికి ఇది చాలా మంచిదని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..తమలపాకు జీర్ణక్రియను మెరుగుపరచడం, దగ్గు–జలుబు తగ్గించడం, నోటి దుర్వాసన పోగొట్టడం, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాల ద్వారా రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇంకా మలబద్ధకం నివారణకు, చర్మ, జుట్టు ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. ఇది ఆయుర్వేదంలో ఒక ముఖ్యమైన ఔషధ ఆకుగా పేర్కొంటారు.

**తమలపాకు సంప్రదాయ ప్రాముఖ్యత:**

తమలపాకు చరిత్రను పరిశీలిస్తే, ఇది కేవలం నమలడానికి మాత్రమే కాదని తెలుస్తుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో తాంబూలం ఇచ్చిపుచ్చుకోవడం అనేది రెండు కుటుంబాల మధ్య సంబంధాన్ని, ఒప్పందాన్ని సూచిస్తుంది. పూర్వకాలంలో వ్యాపార లావాదేవీలలో సైతం ఒప్పందాలను దృఢపరచడానికి తాంబూలం వినియోగించేవారని చరిత్ర చెబుతోంది. తాంబూలం మార్పిడిని ఒక రకమైన అగ్రిమెంట్ లేదా బంధంగా భావించేవారు.. ఇది లిఖితపూర్వక ఒప్పందాల అవసరాన్ని తగ్గించేది.

**జీర్ణవ్యవస్థకు మేలు:**

తమలపాకు ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలలో ఒకటి జీర్ణక్రియకు సహాయపడటం.. భారీగా భోజనం చేసిన తర్వాత, ముఖ్యంగా నూనె, స్వీట్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు, ఒక తమలపాకును చిన్న పటిక బెల్లం ముక్కతో కలిపి నమలడం వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఇది గ్యాస్ట్రిక్ సమస్యలను నివారిస్తుంది, ఆహారం అరగడానికి తోడ్పడుతుంది. రాత్రిపూట దీనిని తీసుకుంటే ఉదయం సుఖ విరేచనం అయ్యేందుకు సహాయపడుతుంది. అయితే, దీనిని అలవాటుగా కాకుండా, అవసరమైనప్పుడు ఔషధంగా మాత్రమే ఉపయోగించాలని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.కాల్షియం గ్రహణానికి: తమలపాకుతో పాటు కొద్దిగా సున్నం కలిపి నమలడం వల్ల శరీరం కాల్షియంను మెరుగ్గా గ్రహిస్తుంది. కాల్షియం మాత్రల కన్నా ఈ సహజ పద్ధతి ద్వారా శరీరానికి కాల్షియం లభిస్తుందని చెబుతారు. సున్నం చాలా తక్కువ మోతాదులో, తమలపాకుకు పలచగా రాసి తీసుకోవాలి.

పిల్లల్లో కడుపు నొప్పికి ఉపశమనం: చిన్న పిల్లల్లో వచ్చే కడుపు నొప్పి, ఉబ్బరానికి తమలపాకు ఒక సహజ చికిత్స. తమలపాకుకు కొద్దిగా ఆముదం రాసి, పెనంపై గోరువెచ్చగా వేడి చేసి, పిల్లల పొట్టపై ఉంచి బట్టతో కట్టాలి. ఇలా రెండు సార్లు చేస్తే పొట్ట ఉబ్బరం తగ్గి, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కళ్ల సంరక్షణకు: కళ్ల వేడిని తగ్గించడానికి, దృష్టి లోపాలను నియంత్రించడానికి తమలపాకును ఉపయోగించవచ్చు. పెరుగు లేదా చిక్కటి మజ్జిగలో తమలపాకులను నలిపి ముంచి, సుమారు అరగంట నుండి రాత్రంతా నానబెట్టాలి. అనంతరం, ఆ మజ్జిగను కళ్లపై వేసుకుని 20–30 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఇది కళ్ల వేడిని తగ్గించి, దృష్టికి మేలు చేస్తుందని వివరించారు. తమలపాకుతో బటర్ మిల్క్ (మజ్జిగ) కూడా తయారు చేసుకోవచ్చు. ఒక లీటరు మజ్జిగకు రెండు లేదా మూడు ఆకులు, కొద్దిగా సోంపు, జీలకర్ర, పటిక బెల్లం (తీపి కోసం), లేదా పచ్చిమిర్చి, పుదీనా, అల్లం (కారంగా కావాలంటే) కలిపి మిక్సీ చేసి తాగవచ్చు. తమలపాకుతో బజ్జీలు కూడా తయారు చేస్తారు.. ఇవి రుచిగా ఉంటాయి. అయితే, తమలపాకును వాడేటప్పుడు సరైన పద్ధతిని పాటించడం అత్యవసరం. దీనిని ఔషధంగా భావించి, పరిమితంగా వాడాలి. రోజువారీ అలవాటుగా మార్చుకోవడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమలపాకులో దాగి ఉన్న ఈ అద్భుత రహస్యాలను తెలుసుకొని, సరైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా మనం ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

# జ్ఞాపకశక్తిని రెట్టింపు చేసే ఎర్ర ముత్యాలు!



పండ్లు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎర్రటి గింజలు కలిగిన దానిమ్మలోని పోషకాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతగానో సహాయపడతాయి.. పండ్లు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎర్రటి గింజలు కలిగిన దానిమ్మలోని పోషకాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతగానో సహాయపడతాయి. ముఖ్యంగా ప్రతిరోజూ దానిమ్మపండు తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. దానిమ్మలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. దీనివల్ల రక్తహీనత వంటి సమస్యలు తగ్గుతాయి. దానిమ్మలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. దీనిని తినడం వల్ల కీళ్లవాతం, దీర్ఘకాలిక వాపు నుండి ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు కణాలను దెబ్బతినకుండా కాపాడి, తద్వారా వాపును తగ్గిస్తాయి.గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో దానిమ్మ చాలా సహాయపడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, పాలిఫెనాల్లు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, ఆరోగ్యకరమైన రక్తనాళాలను కాపాడటంలో, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇది గుండెపోటు ప్రమాదాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుంది. దానిమ్మలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచడంలో సహాయపడతాయి. వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సాధారణ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. దానిమ్మలో శరీరానికి అవసరమైన ఫైబర్‌లో 45% ఉంటుంది. ఇది మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అధ్యయనాల ప్రకారం, ప్రతిరోజూ దానిమ్మపండు తినడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. వయసుతో పాటు వచ్చే అల్జీమర్స్ వంటి వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది. ఇది మెదడు కణాలకు జరిగే నష్టాన్ని కూడా నివారిస్తుంది. దానిమ్మలోని వృద్ధాప్య నిరోధక గుణాలు చర్మ కణాలను పునరుద్ధరించడానికి, చర్మ కాంతిని పెంచడానికి, ముడతలను తొలగించడానికి, చర్మాన్ని ఆరోగ్యంగా, తాజాగా కనిపించేలా చేయడానికి సహాయపడతాయి.

# ఈ టమాటోలతో క్యాన్సర్ పరార్



బ్లాక్ చెర్రీ టమాటోలు ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన పోషకాల గని. వీటిలో ఉండే ఆంథోసైనిన్స్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ల వల్లే వీటికి ఆ నలుపు రంగు వస్తుంది. విటమిన్ ం, అ మరియు పొటాషియం సమృద్ధిగా ఉండే ఈ టమాటోలు కేవలం రుచిని మాత్రమే కాకుండా, శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని కూడా అందిస్తాయి. సాధారణంగా టమాటోలు అంటే ఎరుపు రంగులో ఉంటాయని మనందరికీ తెలుసు. కానీ, ఇటీవల మార్కెట్‌లో నలుపు, ముదురు ఊదా రంగులో మెరిసిపోయే 'బ్లాక్ చెర్రీ టమాటోలు' అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఇవి కేవలం చూడటానికి ప్రత్యేకంగా ఉండటమే కాదు, వీటి రుచి మరియు ఆరోగ్య ప్రయోజనాలు కూడా అద్భుతం. సాధారణ టమాటోల కంటే తీయ్యగా, జ్యూసీగా ఉండే ఈ బుజ్జి టమాటోలు ఇప్పుడు హెల్త్ కాన్షియస్ ఉన్నవారి డైట్‌లో ముఖ్య భాగమయ్యాయి. బ్లాక్ చెర్రీ టమాటోలలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను సమతుల్యం చేసి, రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడి, శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ సరైన రీతిలో అందుతుంది. ఈ టమాటోల్లో ఉండే విటమిన్ అ మరియు యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించి, వృద్ధాప్య ఛాయలు రాకుండా చేస్తాయి. చర్మం సహజంగా మెరిసిపోవడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. అలాగే ఇందులోని విటమిన్ ం రేచీకటి వంటి సమస్యలను నివారించి, కంటి చూపును మెరుగుపరుస్తుంది. డిజిటల్ స్క్రీన్ల ముందు ఎక్కువ సమయం గడిపే నేటి తరానికి ఇది ఒక అద్భుతమైన ఆహారం.బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి బ్లాక్ చెర్రీ టమాటోలు ఒక వరం అని చెప్పవచ్చు. వీటిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి మరియు ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. తక్కువ ఆహారం తీసుకున్నా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి.వీటిని కేవలం పచ్చిగా తినడమే కాకుండా సలాడ్లు, పాస్తా, సూప్‌లలో ఉపయోగిస్తే వంటకాలకు ఒక ప్రత్యేకమైన ఫ్లేవర్ వస్తుంది. వీటిలోని తీపి మరియు పులుపు మేళవింపు భోజనానికి కొత్త రుచిని జోడిస్తుంది. బ్లాక్ చెర్రీ టమాటోలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల చిన్న చిన్న ఇన్ఫెక్షన్ల నుండి దీర్ఘకాలిక వ్యాధుల వరకు అన్నిటికీ చెక్ పెట్టవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఈ 'నల్లటి మణిపూసలను' మీ డైట్‌లో చేర్చుకోండి.

# గర్భనిరోధక మాత్రలతో క్యాన్సరా..?



క్యాన్సర్ గురించి సమాచారం అందించే సంస్థ అయిన క్యాన్సర్‌రీసెర్చ్‌యూకే నివేదిక ప్రకారం.. గర్భనిరోధక మాత్రలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి: ఒకటి కంబైన్డ్ పిల్, ఇందులో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టోజెన్ అనే రెండు హార్మోన్లు ఉంటాయి. గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా ? ఈ ప్రశ్న తరచుగా తలెత్తుతుంది. నిజం ఏమిటంటే గర్భనిరోధక మాత్రలు చాలా కాలంగా వాడుకలో ఉన్నాయి. అవి శరీరంలోని హార్మోన్లను ప్రభావితం చేసి, గర్భధారణను నివారిస్తాయి. కానీ అవి నిజంగా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా? క్యాన్సర్ గురించి సమాచారం అందించే సంస్థ అయిన క్యాన్సర్‌రీసెర్చ్‌యూకే (అజీనిఇవతీతీవబవజీతీఇ్ష్రబీ) నివేదిక ప్రకారం.. గర్భనిరోధక మాత్రలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి: ఒకటి కంబైన్డ్ పిల్, ఇందులో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టోజెన్ అనే రెండు హార్మోన్లు ఉంటాయి. మరొకటి మినీ పిల్, ఇందులో కేవలం ప్రొజెస్టోజెన్ మాత్రమే ఉంటుంది. ఈ మాత్రలు శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను మార్చడం ద్వారా పనిచేస్తాయి. ఇప్పుడు క్యాన్సర్ ప్రమాదం గురించి మాట్లాడుకుందాం. పరిశోధనల ప్రకారం, కంబైన్డ్ పిల్ తీసుకోవడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొద్దిగా పెరగవచ్చు. కానీ ఈ ప్రమాదం శాశ్వతం కాదు. ఒక వ్యక్తి సుమారు 10 సంవత్సరాల తర్వాత ఈ మాత్రలు తీసుకోవడం ఆపేస్తే వారు అసలు మాత్రలు తీసుకోనట్లే ఈ ప్రమాదం సాధారణ స్థితికి వచ్చేస్తుంది. ఇదే కాంబైన్డ్ పిల్ వాడటం వల్ల ముఖ్యంగా దీర్ఘకాలం పాటు వాడినప్పుడు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కొద్దిగా పెరిగే అవకాశం ఉందని తేలింది. అయితే దీనిపై మరింత పరిశోధన అవసరం. అందుకే దీనిని నిశ్చయాత్మకమైనదిగా పరిగణించలేము. ఆసక్తికరంగా ఈ పిల్ అండాశయ, ఎండోమెట్రియల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల నుండి కూడా రక్షణ కల్పిస్తున్నట్లు కనిపిస్తోంది. అలాగే ఈ ప్రయోజనం పిల్ వాడకం ఆపేసిన తర్వాత కూడా కొనసాగుతుంది. మినీ పిల్ గురించి పరిమిత పరిశోధన మాత్రమే జరిగింది కాబట్టి, దాని గురించిన సమాచారం కూడా పరిమితంగానే ఉంది. అయితే, ఇప్పటివరకు ఉన్న డేటా ప్రకారం ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని కొద్దిగా పెంచవచ్చుని, కానీ దీనిని వాడటం ఆపేసిన తర్వాత ఈ ప్రమాదం క్రమంగా తగ్గుతుందని తెలుస్తోంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఇతర క్యాన్సర్లపై దీని ప్రభావాల గురించి ఇంకా స్పష్టమైన నిర్ధారణలు లేవు. ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది: మీరు ఈ మాత్రలు తీసుకోవాలా? ఈ ప్రశ్నకు సమాధానం వ్యక్తిని బట్టి మారవచ్చు. మీ ఆరోగ్యం, అవసరాలు, ప్రమాదాల ఆధారంగా మీ డాక్టర్ తగిన సలహా ఇవ్వగలరు. క్యాన్సర్ ప్రమాదం కేవలం మాత్రల వల్ల మాత్రమే కాకుండా, ధూమపానం, ఊబకాయం, మద్యపానం వంటి అనేక ఇతర కారకాల వల్ల కూడా ప్రభావితమవుతుందని అర్థం చేసుకోవడం ముఖ్యం.

# పాపం.. వైష్ణవి



**కరీంనగర్ :** జగిత్యాల జిల్లా కోరుట్లలో విషాదం చోటుచేసుకుంది. నూరేళ్లూ కలిసి ఉంటామని బాసలు చేసుకుని, పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న ఎనిమిది నెలలకే ఓ గర్భిణి భర్త చేతిలో హత్యకు గురైంది. లవ్ మ్యారేజీ చేసుకున్న తరువాత నుంచి అత్తారింట్లోనే ఉంటున్న వ్యక్తి తన భార్యను హత్య చేశాడని తెలిసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. కోరుట్లలోని మాదాపూర్ గ్రామానికి చెందిన యూట్యూబర్ వైష్ణవి (19)ని ఆమె భర్త హరిబాబు అత్యంత కిరాతకంగా గొంతు నులిమి, కత్తితో పొడిచి హత్య చేశాడు. వైష్ణవి ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి అని కూడా చూడకుండా హరిబాబు చేసిన ఈ ఘాతుకం స్థానికంగా కలకలం రేపుతోంది. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరగ్గా, మంగళవారం వైష్ణవి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించారు. అర్ధరాత్రి ఓసారి అరుపులు విని అత్తామామలు వెళ్లి చూడగా కూతురు, అల్లుడు నిద్రపోతున్నట్లు కనిపించడంతో తిరిగి వారి గదికి వచ్చి నిద్రపోయారు. ఉదయం లేచి చూస్తే కూతురు దారుణహత్యకు గురైందని తెలిసి వైష్ణవి తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకున్నారు. నమ్మి కూతుర్ని చేతిలో పెడితే ఇంత దారుణం చేశాడంటూ రోదించారు. ఘటనా స్థలానికి వెళ్లిన డీఎస్పీ రాములు, సీఐ సురేశ్‌బాబు, ఎస్సై చిరంజీవి వైష్ణవి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. గత కొంతకాలంగా వరకట్నం కోసం హరిబాబు వైష్ణవిని శారీరకంగా, మానసికగా వేధిస్తున్నాడని, ఈ క్రమంలోనే దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వివాదం ముదరడంతో, హరిబాబు విచక్షణ కోల్పోయి వైష్ణవి గొంతు నులిమాడని, ఆపై కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని తెలిపారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.కాగా, సోషల్ మీడియా వీడియోల విషయంలో దంపతుల మధ్య తలెత్తిన వివాదమే ఈ హత్యకు కారణమని ప్రచారం జరిగింది. వైష్ణవి ఒక యూట్యూబర్ కావడంతో, వ్యూస్ కోసం హరిబాబుకు వేరే మహిళతో సంబంధం ఉన్నట్లుగా కొన్ని వివాదాస్పద వీడియోలను చిత్రీకరించారు. వీరిద్దరూ వ్యూస్ కోసమే ఇలా చేశారా.. లేక భర్త చేసే తప్పులను ఎత్తిచూపేందుకు వైష్ణవి వీడియో పోస్ట్ చేసిందా క్లారిటీ లేదు. తన వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతినేలా ఉన్న ఇటువంటి వీడియోలను సోషల్ మీడియాలో పెట్టవద్దని హరిబాబు భార్య వైష్ణవిని హెచ్చరించాడని.. ఆమె లెక్క చేయకపోవడంతో ఇద్దరి మధ్య గొడవలు ముదిరి, చివరకు అది హత్యకు దారితీసిందని స్థానికులు చర్చించుకుంటున్నారు..మరోవైపు, హరిబాబు అదనపు కట్నం కోసం కూడా వైష్ణవిని వేధిస్తున్నాడని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. హరిబాబు తల్లిదండ్రులు ఈ పెళ్లికి అంగీకరించకపోవడంతో అత్తగారి ఇంట్లోనే ఉంటూ ఈ దారుణానికి ఒడిగట్టాడు. హత్య అనంతరం నిందితుడు బైకుపై పరారయ్యాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వైష్ణవి హత్యకు వ్యూస్ కోసం పోస్ట్ చేసిన వీడియోలు కారణమా.. లేక వరకట్నం కోసం వేధించి హత్య చేశాడా అనేది పోలీసుల విచారణలో తేలనుంది.

# దుబాయ్‌లో భయానక అనుభవాలను పంచుకున్న సానియా మీర్జా




**హైదరాబాద్ :** మిడిల్ ఈస్ట్ దేశాలలో ముదురుతున్న యుద్ధ మేఘాలు అక్కడ నివసిస్తున్న భారతీయులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టెన్నిస్ స్టార్ సానియా మీర్జా తన కుమారుడు ఇజ్ హాన్ తో కలిసి క్షేమంగా దుబాయ్ నుండి భారత్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న అనుభవాలు అక్కడి భయానక స్థితికి అద్దం పడుతున్నాయి.దుబాయ్‌లో తాను ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను వివరిస్తూ సానియా మీర్జా కాస్త ఉద్వేగానికి లోనయింది. తమ ఇంటిపై నుండే యుద్ధ విమానాలు వెళ్లడం, అవి ఒకదానికొకటి అడ్డుకోవడం చూసినప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నామని ఆమె తెలిపింది. “మా ఇంటికి కేవలం 400 నుండి 500 మీటర్ల దూరంలోనే విమాన శకలాలు పడ్డాయి. ఆ శబ్దాలకు, దృశ్యాలకు ఇంట్లోనే ఉండి వణికిపోయాం” అని సానియా పేర్కొంది. ప్రస్తుతం కొడుకుతో కలిసి హైదరాబాద్ కు వచ్చిన ఆమె, రంజాన్ పండుగ ముగిసిన తర్వాత పరిస్థితులు చక్కబడితేనే తిరిగి దుబాయ్ వెళ్లాలని భావిస్తోంది.

**ఇరాన్ బంకర్లపై కాల్పులు**

పశ్చిమాసియాలో భీకర యుద్ధం కొనసాగుతుంది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జల సంధిని నియంత్రిస్తున్న ఇరాన్ అడ్డుకునే ప్రయత్నాలను అమెరికా సైన్యం ముమ్మరం చేసింది. ఈ క్రమంలో బుధవారం హర్మూజ్ సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాలపై బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడింది. దాదాపు 2,268 కిలోల బాంబులతో దాడిచేసినట్టు అమెరికా సైన్యానికి చెందిన సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి సమీపంలోని భూగర్భ మిస్సైల్ సిటీ ఖేమ్‌పై సైతం దాడిచేసినట్టు తెలిపింది.'హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ యాంటీ- నౌక విధ్వంసక క్షిపణి స్థావరాలు అంతర్జాతీయ సముద్ర రవాణాకు ప్రమాదకరంగా మారాయి. అందుకే ఈ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాం.. లోతుగా చొచ్చుకుపోయే 5 వేల పౌండ్ల బరువు (దాదాపు 2,268 కిలోలు) ఉన్న శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులతో దాడులు నిర్వహించాం” అని అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ (ట్విట్టర్)లో వెల్లడించింది. అమెరికా-ఇజ్రాయెల్‌లు సంయుక్త ఆపరేషన్‌తో ఇరాన్‌పై ఫిబ్రవరి 28న దాడులు చేయడంతో యుద్ధం మొదలైంది. దీంతో ఐదో వంతు ప్రపంచ చమురు రవాణాకు ముఖ్యమైన హర్మూజ్‌లో నౌకలను ఇరాన్ అడ్డుకోవడంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భగ్గుమంటున్నాయి.ఇదిలా ఉండగా, హర్మూజ్ రక్షణకు తమతో చేతులు కలపాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను నాటో సహా మిత్రదేశాలు తిరస్కరించాయి. ప్రపంచం కోసమే తాను యుద్ధం చేస్తున్నానని ట్రంప్ చెబుతున్న మాటలను ఎవరూ విశ్వసించడం లేదు. ఆయన చర్యలను ఎవరూ సమర్థించడం లేదు.“మేము నాటోకు ఎంతో సహాయం చేసినప్పటికీ అమెరికాకు మద్దతు లభించడం లేదు” అని ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవడం మిత్రదేశాల ప్రయోజనాలకే శ్రేయస్కరమని ఆయన పేర్కొన్నారు. అణ్వాయుధాలను అభివృద్ధి చేసే ఉద్దేశం తమకు లేదని, కేవలం విద్యుదుత్పత్తి వంటి శాంతియుత ప్రయోజనాల కోసమే తమ అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఇరాన్ గట్టిగా చెబుతోంది. తమ యుద్ధ నౌకలను హర్మూజ్‌కు పంపడానికి మిత్రదేశాలు నిరాకరించిన కొద్ది గంటల్లోనే అమెరికా బంకర్ బస్టర్ బాంబులతో దాడులు చేపట్టింది.హర్మూజ్‌లో చమురు రవాణాకు ఆటంకం ఏర్పడకూడదనుకుంటే ఇరాన్ మిస్సైల్ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయాల్సిన అవసరం ఉందని అమెరికా భావిస్తోంది. తద్వారా ఈ మార్గంలో వెళ్లే నౌకలపై ఇరాన్ దాడులను అడ్డుకుంటామని తాజా చర్యతో అమెరికా సంకేతాలిచ్చినట్లయ్యింది. అయితే, గతేడాది జూన్‌లో 12 రోజుల పాటు ఇరాన్‌తో ఇజ్రాయెల్- అమెరికా జరిపిన యుద్ధంలోనూ బంకర్ బస్టర్ బాంబులను వినియోగించారు. 2022 నివేదికల ప్రకారం ఈ ఒక్కో బాంబు తయారీకి 2.88 లక్షల డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.2.6 కోట్లు ఖర్చువుతుంది.

# 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కి'




**హైదరాబాద్ :** భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను పుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కి' మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది.ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది.మార్చి 14న పుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కి' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది.ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్మూజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

## అనుమానం పెనుభూతం

## అక్కను కడతేర్చిన తమ్ముడు

**రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా బాటసింగారంలో దారుణం జరిగింది. అక్క చెడు తిరుగుళు తిరుగుతుందనే అనుమానంతో తమ్ముడు అక్కని చంపి ముక్కలు చేసి చెరువులో పడవేసిన ఘటన బయటపడింది. కొన్నాళ్ల క్రితం బావ చనిపోయిన తర్వాత అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో తమ్ముడు పు రామ్ ఆమెను రెండు భాగాలుగా చేసి మజీత్ పూర్ చెరువులో పడేసాడు. గత నెల 28 నాడు బాటసింగారం కిరణం షాపు నుండి తప్పిపోయిందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో హత్య వ్యవహారం బయటపడింది.

## రహదారిని కబ్జా చేసారు

## రోడ్డెక్కిన శంషీగూడ స్థానికులు

**కూకట్ పల్లి :** ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని శాంషీ గూడ చెందిన ప్రజలు ఆందోళన చేపట్టారు. ప్రగతి నగర్ లోని ప్రణీత్ ఆంటీలియా తరహాలో శంషీగూడలో శిల్పా బృందావనం, సాయి హిల్స్ వాసులు కూడా రహదారిని కబ్జా చేసి గేట్లను ఏర్పాటు చేసి ఎవరిని రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం ప్రజలు రోడ్డెక్కారు. శనివారం,ఆదివారాలు వస్తే శాంషీ గూడ నుండి ఎల్లమ్మబండ కు వెళ్లడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుందని ఆరోపించారు. శిల్ప బృందావన్ నివాసాలు అన్ని హెచ్ఎండిఏ లేఔట్ తో ఏర్పాటుచేసి గేటెడ్ కమ్యూనిటీ అంటూ రహదారిని మూసివేసారని అన్నారు. అదేవిధంగా సాయి హిల్స్ వాసులు కూడా రోడ్డు పై గోడ నిర్మాణం చేపట్టడం పైన ఇప్పటికే డిప్యూటీ కమిషనర్లకు ఉన్న అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. తమకు స్పీకింగ్ ఆర్డర్లలో తోపాటు వీటిని తొలగించాలని ఆదేశాలు ఉన్న ఎవరూ పట్టించుకోకపోవడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను సైతం ఆశ్రయించి ఫిర్యాదు చేశామని తెలిపారు. వీటి పైన విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఈ రోడ్డును ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని దీని ద్వారా మియాపూర్ నుండి వచ్చేవారు నేరుగా గాజులరామారం వెళ్లేందుకు వీలు ఉంటుంది అని తెలిపారు.

## పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ పంజా

**లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఆర్ఐ రిచర్డ్ సైమన్**

**కార్యాలయంలో రికార్డుల క్షుణ్ణంగా పరిశీలన.**

**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏఅః) అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఒక వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసిన ఘటనలో పెద్దేముల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రిచర్డ్ సైమన్ అధికారులకు చిక్కారు.గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తన మోటేషన్ ఫైల్ (ఓబీబిజీబితినీని ఈతిశ్రీవ) ప్రక్రియ పూర్తి చేయించుకోవడానికి ఆర్ఐ రిచర్డ్ సైమన్‌ను సంప్రదించారు. ఇందుకు గాను ఆర్ఐ రూ. 15,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఏసీబీ రంగారెడ్డి రేంజ్ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటుండగా రిచర్డ్ సైమన్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ ఘటన నేపథ్యంలో పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. కార్యాలయంలోని పలు కీలక రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ధరణికి సంబంధించిన వ్యవహారాలు, ఇతర అవకతవకలపై ఆరా తీస్తున్నారు.

## నడి రోడ్డుపై పసికందు మృతదేహం కలకలం

**ఆదిలాబాద్ :** గుడిహత్నూర్ మండల సమీపంలో జాతీయ రహదారి పక్కన మగ పసికందు మృతదేహం లభ్యమైంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పసికందును ఎవరైనా కావాలనే వదిలేశారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## తమిళనాడు ఎన్నికల బిజెపి ఎస్సీ మోర్చా కో-ఇంచార్జ్ గా 'ఎస్. కుమార్' నియామకం

**హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న 'శ్రీ ఎస్. కుమార్' గారికి పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. తమిళనాడులో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని, ఆ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఎన్నికల సహ-ప్రభారీ (కో-ఇంచార్జ్) గా ఆయనను నియమిస్తూ బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్ ఆర్య ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, కేరళం రాష్ట్రాలకు కూడా ఎస్సీ మోర్చా తరఫున ప్రభారీలను, సహ-ప్రభారీలను నియమించారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి ప్రభారీగా శ్రీ శంభునాథ్ తుండియా గారిని, సహ-ప్రభారీలుగా ఎస్. కుమార్ ని మరియు ఎస్. మునిస్వామి (మాజీ ఎంపీ) గారిని నియమించారు.ఎస్. కుమార్ గత కొంతకాలంగా ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన పనితీరును గుర్తించిన పార్టీ నాయకత్వం, తమిళనాడు ఎన్నికల్లో ఓటర్లను సమన్వయం చేసుకుంటూ, పార్టీ విజయానికి వ్యూహరచన చేసేందుకు ఈ కీలక బాధ్యతను కట్టబెట్టింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ నాయకత్వానికి ఎస్. కుమార్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ముంబై నుంచి థాయ్‌లాండ్ వరకు డ్రగ్స్ కనెక్షన్



**హైదరాబాద్, :** మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో కుత్బుల్లాపూర్ ప్రాంతంలో భారీగా డ్రగ్స్ దందా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ (ఆఈ) బృందం మెరుపు దాడులు నిర్వహించి నిషేధిత మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. ఈ దాడుల్లో సుమారు 76.77 గ్రాముల కొకైన్, 200 గ్రాముల ఓజీ కుష్ (హైబ్రీడ్ గంజాయి) తో పాటు రవాణాకు ఉపయోగిస్తున్న ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును అధికారులు సీజ్ చేశారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న సికింద్రాబాద్ యాప్రాల్‌కు చెందిన వ్యాపారి ఇంజోత్ సింగ్ నగపాల్ (27)ను పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుడిని విచారించగా విస్తుపోయే అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్ వివరాలు బయటపడ్డాయి. ముంబైలోని డొంబివ్లికి చెందిన 'అబ్దుజు' అనే నైజీరియన్ వ్యక్తి ద్వారా కొకైన్‌ను, థాయ్‌లాండ్‌లోని పట్టాయాకు చెందిన 'నవి' అనే వ్యక్తి నుంచి ఓజీ కుష్‌ను నిందితుడు సేకరించినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు విదేశీయులు పరారీలో ఉన్నారు. నిందితుడు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు అత్యంత రహస్యంగా వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలింది. టెలిగ్రామ్ యాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ, ఎవరికీ అనుమానం రాకుండా నిర్దేశిత ప్రదేశాల్లో డ్రగ్స్ దాచి ఉంచే “డెడ్ డ్రాప్స్” పద్ధతిలో సరఫరా చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఫయాజుద్దీన్ వెల్లడించారు.పట్టుబడిన నిందితుడు ఇంజోత్ సింగ్‌ను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ యాదయ్య నేతృత్వంలో నిందితుడిని మంగళవారం చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ డ్రగ్స్ సరఫరా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు? కస్టమర్లు ఎవరు? అనే కోణంలో కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# బిజినెస్

## మార్కెట్లోకి డస్టర్ రీ-ఎంట్రీ




భారత వాహన మార్కెట్లో ఎస్‌యూవీలకు క్రేజ్ పెరగడానికి కారణమైన రెనాల్ట్ డస్టర్ మోడల్ తిరిగి దేశంలోని రీ-ఎంట్రీ ఇచ్చింది. మంగళవారం కంపెనీ తన సరికొత్త రెనాల్ట్ డస్టర్ 2026ను అధికారికంగా విడుదల చేసింది. ఈ ఎస్‌యూవీ ధర రూ. 10.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది, అయితే ప్రీ-బుకింగ్‌పై రూ. 10.29 లక్షలకే లభిస్తుందని కంపెనీ తెలిపింది. ప్రీమియం వేరియంట్ ధర రూ. 18.09 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్స్ ప్రారంభవగా, ఏప్రిల్ నుంచి డెలివరీలు మొదలవుతాయి. స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈ-టెక్ 160 వేరియంట్ దీపావళి నాటికి అందుబాటులో ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. రీ-ఎంట్రీ డస్టర్‌లో 6 ఎయిర్‌బ్యాగులతో పాటు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, లెవల్ 2 సహా అనేక రకాల సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. గ్లోబల్ మోడల్‌తో పోలిస్తే మనదేశంలో విడుదలైన వేరియంట్ హెడ్‌ల్యాంప్ డిజైన్, ఐబ్రో డిజైన్ డీఆర్‌ఎల్‌ఎస్ మార్పులతో రావడం గమనార్హం.

## మార్చి 24న సాయి పేరెంటరల్ ఐపిఒ




ప్రముఖ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ కంపెనీ సాయి పేరెంటరల్ వచ్చే వారం ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సెబీకి సమర్పించగా అనుమతులు జారీ అయ్యాయి. మార్చి 24న ఇష్యూ ప్రారంభం కానుందని ఆ కంపెనీ మంగళవారం వెల్లడించింది. మొత్తం రూ.409 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.285 కోట్ల విలువైన కొత్త షేర్లతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కింద 31.57 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. షేర్ల ధరల శ్రేణిని రూ.372-392గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ తమ వృద్ధి ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఎస్‌పిఎల్ సిఎండి అనిల్ కె?కె తెలిపారు. ఐపిఒ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఫార్ములేషన్ బిజినెస్‌ను బలోపేతం చేయడానికి, అలాగే ఇంజెక్టబుల్, ఓరల్ సాలిడ్ డోసేజ్ విభాగాల్లో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (సిడిఎంఒ) సామర్థ్యాలను విస్తరించడానికి వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ఈ పెట్టుబడులు అంతర్జాతీయ మార్కెట్లలో కంపెనీ ఉనికిని మరింత సుస్థిరం చేయనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# జిడిపికి చమురు దెబ్బ!




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద పోకడలతో పశ్చిమాసియాలో రేపిన చిచ్చు.. భారత ఆర్థిక వ్యవస్థకు సెగ పెడుతోంది. వేల మైళ్ల దూరంలో ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంయుక్తంగా సాగిస్తోన్న మారణకాండ భారత జిడిపిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటడంతో పాటు దానికి తోడు దేశంలో నెలకొన్న తీవ్రమైన గ్యాస్ కొరత సామాన్యుల వంటగది నుండి భారీ పరిశ్రమల వరకు అన్ని రంగాలను అతలాకుతలం చేస్తోంది. ప్రధానంగా ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేయడంతో భారత్ దిగుమతి చేసుకునే ఇంధన సరఫరాకు పెద్ద విఘాతం కలిగింది. దీనివల్ల దేశ వృద్ధి రేటు మందగించడమే కాకుండా, ద్రవ్యోల్బణం పెరిగి ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఏజెన్సీలు, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం 90 శాతం, వంట గ్యాస్ కోసం సగానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుత సంక్షోభం కారణంగా దిగుమతులు నిలిచిపోవడంతో గోల్డ్‌మన్ శాక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత 2026 వృద్ధి అంచనాలను 6.5 శాతానికి తగ్గించాయి. ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు తగ్గించి చమురు ధరల భారాన్ని కొంతవరకు భరించగలిగినప్పటికీ, పారిశ్రామిక రంగంపై పడే దెబ్బ వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఇండస్ ఇండ్ బ్యాంక్ ఆర్థికవేత్త గౌరవ్ కపూర్ విశ్లేషించారు. ఇప్పటికే గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో గ్యాస్ కొరత కారణంగా వేలాది ఇంజనీరింగ్ సంస్థలు తమ కార్యకలాపాలను నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రభావం కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా సామాన్యుల జీవనోపాధిని కూడా దెబ్బతీస్తోంది. ముఖ్యంగా దేశంలో వేగంగా పెరుగుతున్న గిగ్ ఎకానమీలో భాగమైన లక్షలాది మంది డెలివరీ ఏజెంట్ల ఆదాయం ఇంధన ధరలు, గ్యాస్ కొరత వల్ల సగానికి పైగా పడిపోయింది. మరోవైపు గల్ఫ్ దేశాలకు జరిగే సుమారు 200 బిలియన్ డాలర్ల ఎగుమతులు కూడా ప్రమాదంలో పడ్డాయి. దీనివల్ల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో 92.5 వద్దకు పడిపోయింది. ఒకవైపు వృద్ధి తగ్గుతూ.. మరోవైపు ధరలు పెరుగుతుండటంతో భారత ఆర్థిక వ్యవస్థ ఒక క్లిష్టమైన పరీక్షను ఎదుర్కొంటోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్



ట్రంప్ ఆంక్షలకు తలొగ్గిన మోడీ సర్కార్ అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్ వేస్తోంది. దీంతో ఆ దేశం నుంచి భారీగా దిగుమతులు జరగడంతో భారత వాణిజ్య లోటు పెరిగి.. ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌ల ప్రభావం భారత ఎగుమతులపై స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో అమెరికాకు జరిగిన ఎగుమతులు 12.88 శాతం పతనమై 6.88 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇదే సమయంలో అమెరికా నుండి దిగుమతులు 36.53 శాతం పెరిగి 4.48 బిలియన్ల డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు అమాతం దాదాపు 30 బిలియన్ డాలర్లకు చేరడం తీవ్ర ఆందోళకరం. మరోవైపు చైనా నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లోనే చైనాతో వాణిజ్య లోటు 102.01 బిలియన్లకు చేరుకుని.. తొలిసారి 100 బిలియన్ల మైలురాయిని దాటేసింది. చైనాకు ఎగుమతులు పెరిగినప్పటికీ.. దిగుమతులు ఏకంగా 119.55 బిలియన్లకు చేరడం అధిక లోటుకు కారణమైంది. ఇతర దేశాల విషయానికి వస్తే.. స్విట్జర్లాండ్ నుండి బంగారం దిగుమతులు ఏడు రెట్లు పెరిగి 2.71 బిలియన్లకు చేరగా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలకు ఎగుమతులు వృద్ధిని నమోదు చేశాయి. అయితే బ్రిటన్, సౌదీ అరేబియా, సింగపూర్ వంటి కీలక మార్కెట్లకు ఎగుమతులు క్షీణించాయి. ఫిబ్రవరి 2026లో స్థూల ఎగుమతులు ఆశించిన స్థాయిలో పుంజుకోకపోగా.. దిగుమతులు ఏకంగా 21.61 శాతం ఎగబాకి 80.09 బిలియన్ డాలర్లకు చేరడం గమనార్హం. మరోవైపు సరుకుల ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 11 శాతం క్షీణించి 36.61 బిలియన్ డాలర్లకు పడిపోవడంతో వాణిజ్య లోటు పెరిగింది. ఎగుమతులు పడిపోయి, దిగుమతుల భారం పెరగడం వల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది రూపాయి విలువపై ఒత్తిడి పెంచడమే కాకుండా, విదేశీ మారక నిల్వలపై కూడా ప్రతికూల ప్రభావం చూపనుంది. మరోవైపు.. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత వాణిజ్య రంగానికి మరిన్ని కష్టాలను తెచ్చిపెటొచ్చని నిపుణులు హెచ్చరించారు.

# స్పోర్ట్స్

## ఆ విషయంలో స్వార్థపరుడినే: సంజూ శాంసన్

టీ20 ప్రపంచకప్-2026 హీరో, టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇతరుల మెప్పు కోసం తాను ఎప్పుడూ ఏ పనీ చేయలేదని తెలిపాడు. ఎల్లప్పుడూ తన మనసు చెప్పినట్లే నడుచుకున్నానని.. ఈ విషయంలో తాను స్వార్థపరుడినే అన్నాడు.

**దాగుడుమూతల మాదిరి..**

భారత టీ20 జట్టు ఓపెనర్‌గా 2024 నుంచి రాణిస్తున్న సంజూ శాంసన్.. శుబ్‌మన్ గిల్ పునరాగమనంతో కొన్నాళ్లు తుదిజట్టులో చోటు కోల్పోయాడు. ఆ తర్వాత గిల్ స్థానంలో తిరిగి జట్టులోకి వచ్చినా.. సరిగ్గా వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభానికి ముందే ఫామ్ కోల్పోయాడు. దీంతో ఓపెనర్, వికెట్ కీపర్‌గా సంజూ స్థానాన్ని ఇషాన్ కిషన్ భర్తీ చేశాడు.

**నాకౌట్ దశలో వరుసగా హాఫ్ సెంచరీలు**

అయితే, కీలక నాకౌట్ మ్యాచ్‌లలో యాజమాన్యం సంజూకు తిరిగి ఓపెనర్‌గా అవకాశం ఇవ్వగా దుమ్ములేపాడు. ముఖ్యంగా సెమీస్ చేరాలంటే వెస్టిండీస్‌తో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో 97 పరుగులతో అజేయంగా నిలిచాడు ఈ వికెట్ కీపర్ బ్యాటర్. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో సెమీస్‌లో 89, న్యూజిలాండ్‌తో ఫైనల్లో 89 పరుగులతో సంజూ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ మూడు సందర్భాల్లోనూ అతడి సెంచరీ చేసే అవకాశం కోల్పోవడం గమనార్హం. ఏదేమైనా భారత్ టీ20 వరల్డ్‌కప్-2026 గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజూ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.


ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన సంజూ తనకు జట్టు ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని పేర్కొన్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ డ్రెసింగ్ రూమ్‌లో ఎప్పుడూ దీని గురించే మాట్లాడేవారన్నాడు. ప్రతి ఒక్క ఆటగాడు జట్టు విజయం కోసమే శ్రమించాలని దిశా నిర్దేశం చేసేవారని పేర్కొన్నాడు.




**ఆ విషయంలో నేను స్వార్థపరుడినే**

"మా కోచ్ , కెప్టెన్ డ్రెసింగ్‌రూమ్‌లో కొత్త విధానాన్ని తీసుకువచ్చారు. వ్యక్తిగత రికార్డుల కంటే కూడా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని.. అందుకు తగ్గట్లే ఆడాలని పదే పదే మాకు చెప్పేవారు. మా నాయకత్వ బృందం నిర్ణయానుసారమే మేమంతా నడుచుకున్నాము. నిజం చెప్పాలంటే ప్రతి ఒక్క ఆటగాడు అలాగే ఆలోచించాలి. నేనైతే నా మనసు చెప్పినట్లే జట్టు ప్రయోజనాల కోసం మాత్రమే ఆడేవాడిని. ఈ విషయంలో నేను స్వార్థపరుడినే. నా పట్ల నేను నిజాయితీగా ఉండటం ద్వారా నాలోని బలహీనతలు అధిగమించడం సులువైంది" అని సంజూ శాంసన్ చెప్పుకొచ్చాడు. కాగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం ఇటీవలే ఇదే విషయాన్ని నొక్కి వక్కాణించిన విషయం తెలిసిందే. రోహిత్ శర్మ సారథ్యంలో 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో అనుభవం ఉందని.. అయితే, తమ జట్టులో యువకులు ఉన్నా జట్టు ప్రయోజనాలకే పెద్దపీట వేశారని అన్నాడు. తద్వారా టీమిండియా మరోసారి వరల్డ్‌కప్ ట్రోఫీ గెలిచిందని పేర్కొన్నాడు.

## ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్.. పాట్ కమిన్స్ స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలు



ఐపీఎల్ సీజన్ 2026 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. జట్టు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను నియమించింది. అయితే, ఈ నిర్ణయం తాత్కాలికమే. ఎస్‌ఆర్‌హెచ్ జట్టుకు కొన్ని సీజన్ల నుంచి రెగ్యులర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఆస్ట్రేలియా ఆటగాడు పాట్ కమిన్స్ కొన్ని ప్రారంభ మ్యాచులకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో కమిన్స్ ఎస్‌ఆర్‌హెచ్ జట్టుతో చేరేవరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ విషయాన్ని జట్టు యాజమాన్యం బుధవారం అధికారికంగా వెల్లడించింది. మరోవైపు ఎస్‌ఆర్‌హెచ్ స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇటీవలి టీ20 వరల్డ్ కప్‌లో ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో 193 స్ట్రైక్‌రేట్‌తో కిషన్ 317 పరుగులు చేశాడు. ఇక అభిషేక్ శర్మ పూర్తి స్థాయిలో రాణించకపోయినా.. కొన్ని మ్యాచుల్లో తనదైన శైలిలో ఆడి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కిషన్ గత ఏడాది ఝార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్ (టీ20)లో ఝార్ఖండ్‌ను విజేతగా నిలబెట్టాడు. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ రాణించాడు. 10 మ్యాచుల్లో 197 స్ట్రైక్ రేట్‌తో 517 పరుగులు చేశాడు. ఫైనల్‌లో సెంచరీ కూడా సాధించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ట్రోఫీని అందించాడు. అందుకే కెప్టెన్‌గా అతడికున్న అనుభవంతో ఈ సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్ జట్టుకు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ మంచి విజయాల్ని అందిస్తాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ఒకప్పుడు జాతీయ జట్టులో స్థానం కోల్పోయిన ఇషాన్ కిషన్ ఇప్పుడు అద్భుతమైన ఆట తీరుతో ప్రామిసింగ్ ప్లేయర్‌గా మారాడు. పాట్ ప్రస్తుతం వెన్నెముక గాయంతో బాధపడుతున్నాడు. అందువల్లే ఆయన ప్రారంభ మ్యాచులకు అందుబాటులో ఉండటం లేదు.

## రికార్డు స్థాయి బిడ్.. తుది దశకు ఆర్సీబీ అమ్మకం!



ఐపీఎల్లో 2025లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చాంపియన్‌గా నిలిచింది. అయితే 17 సీజన్ల పాటు కింగ్‌ఫిషర్ కంపెనీ నిర్వహిస్తూ వచ్చిన ఆర్బీబీ ఫ్రాంచైజీని అమ్మకానికి పెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఆర్సీబీ అమ్మకం ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. స్వీడన్?కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఈక్యూటీ భారీ బిడ్ పెట్టినట్లు సమాచారం. మరోవైపు మణిపాల్ హాస్పిటల్స్ అధినేత రంజన్ ?పై, అమెరికా సంస్థ కోల్‌బెర్గ్ క్రావిస్ రాబర్ట్స్ అండ్ కో (కేకేఆర్), సింగపూర్ ఇన్వెస్ట్మెంట్ గ్రూప్ టెమాసెక్ కలసిన కన్సార్టియం కూడా పోటీలో ఉంది. కాగా మొత్తం డీల్ విలువ సుమారు 2 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. ప్రారంభంలో మాంచెస్టర్ యునైటెడ్ సహ యజమానులు గ్లేజర్స్, అదార్ పూనావాలా కూడా ఆసక్తి చూపినప్పటికీ చివరికి రేసు నుంచి తప్పుకున్నారు. గ్లేజర్స్ సుమారు 1.8 బిలియన్ డాలర్ల నాన్ బైండింగ్ ఆఫర్ ఇచ్చినట్లు, అయితే ఈక్యూటీ దాన్ని దాటేలా బిడ్ పెంచినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ డీల్ సూటిగా బిడ్డింగ్ పోరుగా మారింది. డయాజియో గ్రూప్ మార్చి 31ని గడువుగా పెట్టి ఈ అమ్మకాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడం వెనుక కూడా ఈ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మూడు సంస్థలు బైండింగ్ బిడ్లు సమర్పించినట్లు తెలుస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఫేవరెట్?గా నిలుస్తోంది. మొదట మెజారిటీ వాటా అమ్మాలని భావించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఇప్పుడు పూర్తి విక్రయానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఫ్రాంచైజీ విలువ 1.1 బిలియన్ నుంచి 1.35 బిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనా. రైన్ గ్రూప్ ఈ అమ్మక ప్రక్రియను పర్యవేక్షిస్తోంది. అమెరికాకు చెందిన డేవిడ్ బ్లిట్జర్, ఆదిత్య బిర్లా గ్రూప్ కలిసి కన్సార్టియంగా బిడ్ సమర్పించినట్లు తెలుస్తోంది. మార్చి 31 ఈ డీల్ కూ కీలక గడువుగా ఉంది. అయితే ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుకు అభిమానులు చాలా మంది ఉంటారు. ఖరీదైన జట్టుగా పేరున్న ఆర్సీబీని దక్కించుకోవడానికి రెండు ప్రధాన సంస్థలు పోటీలో ఉన్నాయి. అంతిమంగా ఐపీఎల్ ఫ్రాంచైజీల విలువలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆర్సీబీ అమ్మకం ఫ్రాంచైజీ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద డీల్స్‌లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది.

# నటనపై ప్రేమతోనే అలా అడిగేదాన్ని



సరైన సమయం వచ్చినప్పుడు.. ఎంత కష్టమైనా పడి హిందీ, దక్షిణాది చిత్ర పరిశ్రమల్లో నా కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలనుకుంటున్నానని అంటోంది అందాల తార మృణాల్ ఠాకూర్. గుర్తుండిపోయే పాత్రల్ని ఎంచుకోవడంలో ముందు వరుసలో ఉండే నాయిక ఈమె. గతేడాది 'సన్ ఆఫ్ సర్దార్ 2'తో సందడి చేసిన మృణాల్.. 2025 కన్నా రెట్టింపు ఉత్సాహంతో ఈ సంవత్సరంలో సందడికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ తన సినీ కెరీర్ గురించి కొన్ని కబుర్లు పంచుకుంది 'నేను కెరీర్ ప్రారంభించినప్పుడు.. ఇలా చేయాలి.. అలా చేయాలి అని నా ప్రణాళికలో చాలా విషయాలు ఉండేవి. కానీ అప్పుడు వాటికి అనుకూలమైన పరిస్థితులు లేవు. ఉత్తరాది, దక్షిణ చిత్రాల మధ్య కెరీర్‌ను బ్యాలెన్స్ చేస్తూనే ముందుకు వెళ్లాలనుకుంటున్నా. తమిళ పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టాలనే ఆలోచన ఉంది. చాలా కథలు వింటున్నాను. మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నా. అయినా నాకు భాషతో అవసరం లేదు. భావోద్వేగాలే ముఖ్యం. ఉత్తమ కథలు దొరికినప్పుడు వివిధ భాషల్లో పని చేయాలని కోరుకుంటున్నా". 'చిత్రపరిశ్రమలోకి బయటి వ్యక్తిగా అడుగుపెట్టడం, అవకాశాలు అందుకోవడం సవాలుతో కూడుకున్న పని. బాలీవుడ్‌లో నా తొలినాళ్లు చాలా కష్టంగా గడిచాయి. కాలక్రమేణా.. ఆ అడ్డంకులను దాటుకొని నటిగా ఎదగడానికి అవకాశాలను ముందుగానే వెతకడం నేర్చుకున్నా. నేను నటించిన 'దో దీవానే సెహర్ మే' నా దగ్గరికి అలా వచ్చిన సినిమానే. ఈ చిత్ర దర్శకుడు రవి ఉద్యవార్‌ని నేరుగా సంప్రదించాను. 'మామ్' చూసిన తర్వాత 'నేను మీతో పనిచేయాలనుకుంటున్నా'నని చెప్పా. ఇలా చొరవ తీసుకొని అడగడం కొత్త కాదు. నిజానికి నేను పని కోసం సంప్రదించిన మొదటి దర్శకుడు ఆదిత్య ధర్. అవకాశాలు నాకంత తేలికగా రాలేదు. వాటిని సృష్టించుకోవాలి. వెంబడించాలి. దర్శకులు నా ముఖం చూసేలా చేసుకోవాలి. అయినా ఇలాంటి పనులు చేయడానికి నేను సిగ్గుపడను.



# 'యూత్' తెలుగు ట్రైలర్ రిలీజ్

తమిళ నటుడు కరుణాస్ వారసుడు కెన్ కరుణాస్? హీరోగా పరిచయమవుతున్న చిత్రం యూత్. ఈ మూవీకి కెన్ కరుణాస్ స్వీయ దర్శకత్వం వహించడం విశేషం. జీవీ ప్రకాశ్ కుమార్ పైసా పారితోషికం తీసుకోకుండా ఫ్రీగా సంగీతం అందించాడు. ఇటీవలే తమిళ ట్రైలర్ రిలీజ్ చేయగా మంచి స్పందన లభించింది. తాజాగా యూత్ తెలుగు ట్రైలర్ వదిలారు. 'మీకు పుట్టినవాడు సాధారణమైన అబ్బాయి కాదు మేడమ్.. ఆ దేవుడే మీకు బిడ్డగా పుట్టాడు. వాడిని బ్యాడ్ బాయ్స్‌తో చేరనివ్వకండి' అన్న సంభాషణతో వీడియో మొదలవుతుంది. తీరా హీరో.. తనను ముగ్గురమ్మాయిలు ప్రేమిస్తున్నారని తెగ సంబరపడిపోతాడు. ఫైటింగ్, లవ్, కామెడీకి ఏమాత్రం కొదవ లేనట్లుగా చూపించారు. ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అనేలా ట్రైలర్ కట్ చేశారు. ఈ సినిమా మార్చి 26న విడుదల కానుంది.

# శర్వాకు జోడీగా టాలీవుడ్ బుట్టబొమ్మ!





చార్మింగ్ స్టార్ శర్వా నంద్ ప్రస్తుతం 'భోగి'తో బిజీగా ఉన్నాడు. ఈ భారీ పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామాకు సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నాడు. శర్వా కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన వెంచర్‌లలో ఒకటిగా రూపొందుతోన్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన పలు అప్డేట్స్ సూపర్ బజ్ క్రియేట్ చేశాయి. ఇక ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. శర్వా మరో చిత్రానికి సిద్ధం అయ్యాడు. ఈ మేరకు దర్శకుడు శ్రీను వైట్లతో చేతులు కలిపాడు. శర్వానంద్, శ్రీను వైట్ల కాంబోలో వస్తున్న ఈ క్లీన్ ఎంటర్టైనర్, సైన్స్ ఫిక్షన్ మూవీలో ఇండస్ట్రీలో హ్యాపెనింగ్ కమెడియన్స్ వెన్నెల కిషోర్, సత్య, బుల్లి రాజు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రజెంట్ స్క్రిప్ట్ వర్క్ జరుగుతుండగా.. జూన్ లేదా జులై నుంచి షూటింగ్ ఉండచ్చుని ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. 2027 సంక్రాంతి టార్గెట్‌గా రూపొందబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ వచ్చింది. ఇందులో ఫీమేల్ లీడ్ కోసం టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేను సంప్రదించగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిస్తుంది. అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.



# ఆగిపోయింది అనుకున్న సినిమా మళ్లీ స్టార్ట్

గత కొంతకాలంగా వరుస పరాజయాలు చవిచూస్తున్న మ్యాచో స్టార్ గోపిచంద్ ప్రజెంట్ ఒక సాలిడ్ హిట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే ప్రస్తుతం సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకోగా.. ఇప్పుడు తన తదుపరి చిత్రంపై ఫోకస్ పెట్టాడు. డెబ్యూ డైరెక్టర్ కుమార సాయి దర్శకత్వంలో గోపీచంద్ 2025లో ఒక ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయినప్పటికీ.. కొన్ని అనివార్య కారణాల చేత ఆగిపోయింది. ఇక ఈ సినిమా పూర్తిగా ఆగిపోయిందని భావించారు. కానీ తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా అనౌన్స్ చేసిన నిర్మాణ సంస్థ నుండి రాబోతున్న నాగచైతన్య చిత్రం 'వృషకర్మ' షూటింగ్ పూర్తి కావడంతో.. మేకర్స్ ఇప్పుడు గోపీ చంద్ సినిమాపై ఫోకస్ పెట్టారట. దీంతో ఆగిపోయిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు మళ్లీ పట్టాలెక్కడానికి సిద్ధమైందని తెలుస్తుండగా.. తాజా షెడ్యూల్ విదేశాల్లో ప్లాన్ చేశారు మేకర్స్. ఈ సంవత్సరం చివరి వరకు షూటింగ్ పనులు పూర్తి చేసుకుని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన న్యూస్ వైరల్ అవుతుండగా.. ఆగిపోయింది అనుకున్న ప్రాజెక్టు మళ్లీ స్టార్ట్ కావడంతో గోపీ చంద్ అభిమానులు ఖుష్ అవుతున్నారు.



# 'ధురంధర్ 2' తెలుగు ప్రీమియర్లు క్యాన్సిల్?.. అసలు కారణం ఇదే!

బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'ధురంధర్: ది రివెంజ్' తెలుగు ప్రీమియర్ల కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. కంటెంట్ డెలివరీలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా నేడు (మార్చి 18) ప్లాన్ చేసిన అన్ని తెలుగు వెర్షన్ పెయిడ్ ప్రీమియర్ షోలను అధికారికంగా రద్దు చేశారు. ఇప్పటికే బుక్‌మైషో, పేటీఎం వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ షోల బుకింగ్స్‌ను తొలగించడమే కాకుండా, టికెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులకు పూర్తి మొత్తాన్ని వెనక్కి ఇచ్చే రీఫండ్ ప్రక్రియను కూడా నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సాంకేతిక ఇబ్బందుల ప్రభావం కేవలం తెలుగు మరియు ఇతర ప్రాంతీయ భాషా ప్రీమియర్లపైనే పడగా, హిందీ వెర్షన్ కంటెంట్ అందుబాటులో ఉండటంతో నగరంలోని కొన్ని ప్రధాన మల్టీప్లెక్స్‌లలో హిందీ షోలు యథావిధిగా కొనసాగే అవకాశం ఉంది. సుమారు 3 గంటల 49 నిమిషాల సుదీర్ఘ నిడివితో, 'ఎ' సర్టిఫికేట్ పొందిన ఈ భారీ చిత్రం రేపు ఉదయం నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లో ప్లాన్ చేసిన విధంగానే గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీమియర్ షోల రద్దుతో నిరాశ చెందిన ప్రేక్షకులు తమ రీఫండ్ స్టేటస్ గురించి సంబంధిత యాప్స్ లేదా థియేటర్ యాజమాన్యాన్ని సంప్రదించాలని చిత్రబృందం సూచించింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com